విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily

సంపుటి : 3 సంచిక : 339 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ శుక్రవారం 1 మే 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




శ్రీసత్యసాయి జిల్లాలో పుట్టపర్తి సమీపంలో భారీ ఏరోస్పేస్ పరిశ్రమ వస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. బెంగళూరులో విస్తరణకు అవకాశం లేకపోవడంతో ఏరోస్పేస్ రంగం శ్రీసత్యసాయి జిల్లావైపు చూస్తోందని, అక్కడ డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు వస్తాయని తెలిపారు. ఈ రంగాల్లో సమీప భవిష్యత్తులో రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. అక్కడ ఏరోస్పేస్ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన కంపెనీకి అనుమతులు, ఇతర ప్రక్రియలను వేగంగా పూర్తిచేసి, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే ఏంటో చూపించారని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌ను గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం అభినందించారు.



# శ్రీసత్యసాయి జిల్లాలో భారీ ఏరోస్పేస్ పరిశ్రమ





- ఉద్యోగ నియామకాలకు ఏఐ, ఐటీ పరిజ్ఞానం తప్పనిసరి చేయాలి
- నైపుణ్యం పెంచుకోకపోతే మంత్రులూ వెనకబడిపోతారు
- రాజధాని నిర్మాణ వ్యయంపై వైకాపా విష ప్రచారం
- సింగపూర్‌లోని ఉత్తమ విధానాలను ఇక్కడ అమలు చేయాలి
- మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

గూగుల్ డేటాసెంటర్‌ను విశాఖకు తీసుకురావడం వెనుక జరిగిన కృషిని ఆయన వివరించారు. లోకేశ్ అమెరికాలో గూగుల్ ప్రతినిధులను కలిసి రాష్ట్రానికి వచ్చేందుకు ఒప్పించారని చెప్పారు. పన్నులకు సంబంధించి కేంద్రప్రభుత్వ విధానాలతో కొన్ని సమస్యలున్నాయని గూగుల్ ప్రతినిధులు చెబితే, ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌లకు తాను ఆ విషయం వివరించి, తగిన మార్పులు చేసేందుకు ఒప్పించి, మార్గం సుగమం చేసినట్లు తెలిపారు. ఇప్పుడు విశాఖలో డేటాసెంటర్ ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో కొంచెం పైస్థాయి ఉద్యోగ నియామకాల అర్హతల్లో ఏఐ, ఐటీ పరిజ్ఞానాన్ని తప్పనిసరి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. మంత్రులు కూడా ఏఐ, ఐటీల్లో పరిజ్ఞానం పెంచుకోవాలని, లేకపోతే వెనకబడిపోతారని పేర్కొన్నారు. జలధార, జలహారతి పథకాలపై మంత్రులందరితో సమన్వయం చేసుకోవాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి సూచించారు. రాజధాని అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేక వైకాపా విషం కక్కుతోందని సీఎం మండిపడ్డారు. డీజిల్‌కు తాత్కాలిక కొరత వస్తే దాన్నీ అమరావతికి ముడిపెట్టి దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. 'ఇలాంటి తప్పుడు, అరాచక ప్రచారాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత మంత్రులదే' అని తెలిపారు. అమరావతి నిర్మాణవ్యయం ఇతర దేశాలతో పోలిస్తే తక్కువే ఉందన్నారు.

- మిగతా2లో

## పదిలో 85.25% పాస్

- 87.90% ఉత్తీర్ణతతో మెరిసిన బాలికలు.. బాలురు 82.68%
- ప్రథమ స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా
- రెండు, మూడు స్థానాల్లో అంబేద్కర్ కోనసీమ, విజయనగరం
- అట్టడుగున అల్లూరి సీతారామరాజు జిల్లా
- ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్




పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో 85.25% మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 6,18,131 మంది పరీక్షలకు హాజరు కాగా.. 5,26,954 మంది పాసయ్యారు. బాలురు 82.68%, బాలికలు 87.90% మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర కంటే బాలికలు 5.22% ఎక్కువ ఉత్తీర్ణులయ్యారు. పరీక్షల ఫలితాలను విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ గురువారం 'ఎక్స్' వేదికగా విడుదల చేశారు.

- మిగతా2లో

## గూడూరు గుభేల్..45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఈ సీజన్‌లో ఇదే అత్యధికం

రాష్ట్రంలో రోజురోజుకూ తీవ్రమవుతున్న వేడిమి



రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వేడి, సెగ తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. గురువారం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో రికార్డు స్థాయిలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్‌లో

- మిగతా2లో



## అత్యాచార బాధితుల కోసం గర్భవిచ్ఛిత్తి చట్టాన్ని మార్చండి

కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన

దిల్లీ: అవాంఛిత గర్భాన్ని కొనసాగించాలంటూ అత్యాచార బాధిత బాలికలను బలవంతపెట్టలేమని

- మిగతా2లో

## ఘోర రోడ్డు ప్రమాదం.. 17 మంది మృతి



ఖాట్మండ్, ఏప్రిల్ 30: నేపాల్‌లోని రోల్పా జిల్లాలో జీపు అదుపుతప్పి భారీ లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 17 మంది మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. తవాంగ్ మున్సిపాలిటీ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది

- మిగతా2లో

## కోహినూర్‌ను భారత్‌కు ఇచ్చేయమని అడుగుతా



న్యూయార్క్: చారిత్రక కోహినూర్ వజ్రాన్ని భారత్‌కు తిరిగి ఇచ్చేయాలని బ్రిటన్ రాజు ఛార్లెస్-3ని కోరతానని న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ తెలిపారు. భారతీయ మూలాలున్న మమ్దానీ చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. బ్రిటన్ రాజు,

- మిగతా2లో

## బెంగాల్ గరంగరం

- ఎగ్జిట్‌పోల్స్‌తో సంబరాల్లో భాజపా
- కలవరంలో తృణమూల్
- ఈవీఎంలు తారుమారంటూ స్ట్రాంగ్‌రూం ముందు మమత ధర్నా

- మిగతా2లో

## వైజాగ్ స్టీల్‌కు మరో 8వేల కోట్లు




కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ప్రకటించిన రూ.11వేల కోట్ల ఆర్థికప్యాకేజీతో గాడిలో పడిన విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కార్యకలాపాలను సుస్థిరంగా మార్చేందుకు మరో రూ.8,097 కోట్ల ఆర్థికసాయం చేయడానికి కేంద్రం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఫైల్‌ను కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి క్లియర్‌చేసి ఆర్థికశాఖ ఆమోదం కోసం పంపినట్లు

- మిగతా2లో



## అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు

- విశ్వవిద్యాలయాలు పరిశోధన, ఆవిష్కరణ కేంద్రాలుగా మారాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కోర్సులను పునర్వ్యవస్థీకరించాలని అధికారులకు సూచన
- 20 లక్షల మందికి పూర్తి నైపుణ్యంతో ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని స్పష్టీకరణ
- ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పాఠ్యాంశాలను రూపొందిస్తున్నామని తెలిపిన మంత్రి లోకేశ్
- ఉద్యోగ, ఉపాధి అవకాశాల సమాచారం కోసం సమీకృత పోర్టల్ ఏర్పాటు చేయాలని ఆదేశం

- మిగతా2లో



## సముద్రంలో ముంచేస్తాం

- పర్షియన్ గల్ఫ్‌లో అమెరికన్లకు పనేంటి?
- ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ప్రశ్న
- అణు సామర్థ్యాలను కాపాడుకుంటామని ఉద్ఘాటన
- హర్మూజ్‌పై తమ నియంత్రణ కొనసాగుతుందని స్పష్టీకరణ
- జలసంధిని తెరిచేందుకు కొత్త ప్రణాళికను ప్రతిపాదించిన ట్రంప్

- మిగతా2లో

# శ్రీసత్యసాయి జిల్లాలో భారీ ఏరోస్పేస్ పరిశ్రమ

-మొదటిపేజీ తరువాయి

**సింగపూర్‌లోని ఉత్తమ విధానాలను ఇక్కడ అమలు చేయాలి**

మంత్రులు సింగపూర్‌కు వెళ్లామా? వచ్చామా అన్నట్టు కాకుండా, అక్కడ పరిశీలించిన ఉత్తమ విధానాలను రాష్ట్రానికి ఎలా వర్తింపజేయాలన్నది ఆలోచించాలని సీఎం సూచించారు. 'గతంలోనూ మంత్రుల్ని వివిధ దేశాలకు, ప్రాంతాలకు పంపేవాడిని. అక్కడ గమనించిన ఉత్తమ విధానాలను వారు తిరిగొచ్చాక వారి శాఖల్లో అమలు చేసేందుకు ప్రయత్నించేవారు. ఎక్కడ మంచి విధానాలున్నా మనం అందిపుచ్చుకోవాలి. అందుకే మంత్రుల్ని విదేశాలకు పంపుతుంటాను' అని వివరించారు. మంత్రుల సింగపూర్ పర్యటనపైనా వైకాపా చేస్తున్న దుష్ప్రచారానికి దీటుగా బదులివ్వాలన్నారు. అధ్యయనాంశాలపై నివేదికలు సమర్పించాలని పర్యటన నుంచి వచ్చిన మంత్రులకు సీఎం సూచించారు.

**వేసవిలో ప్రజలు జాగ్రత్త**

ఎండల తీవ్రత పెరుగుతున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రుల్ని సీఎం ఆదేశించారు. తాగునీటికి కొరత లేకుండా, ప్రజలకు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రిజర్వాయర్లు, చెరువులు, కాలవల నిర్వహణపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని సూచించారు. సూర్యఘర్ పథకం అమలుతీరు బాగుందని, అన్ని జిల్లాల్లో పర్యటించి మరింత వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను సీఎం ఆదేశించారు.

**పిల్లలే సంపద పేరుతో ప్రచారం**

రాష్ట్రంలో జననాల రేటు పెంపుపైనా చాలా సమయం చర్చ జరిగింది. జూన్ నుంచి 'పిల్లలే సంపద' పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టనున్నట్టు సీఎం తెలిపారు. మూడోబిడ్డ నుంచి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. 'ఇద్దరికి మించి పిల్లల్ని కనేలా అవగాహన కల్పించాలి. మూడోబిడ్డ పుడితే ప్రత్యేక ప్రోత్సాహకం ఇవ్వడంతో పాటు, ఆపైన ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనంతోపాటు ప్రభుత్వ పథకాలన్నీ వర్తింపజేస్తాం. పైచదువుల వరకు ఆర్థిక సహకారమూ అందిస్తున్నాం కాబట్టి, తల్లిదండ్రులపై ఆర్థికభారం పెద్దగా పడబోదన్న విషయాన్ని వారికి వివరించాలి' అని సీఎం సూచించారు. ఈసారి పదో తరగతి ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని మంత్రి సంధ్యారాణి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇతర జిల్లాలు, మొత్తం ఫలితాల వివరాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వివరించారు ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత గురించి ఆయన చెప్పబోగా.. సీఎం కలగజేసుకుని..విద్యాశాఖ మంత్రి కేవలం ప్రభుత్వ పాఠశాలలపైనే కాకుండా, రాష్ట్రంలోని అన్ని రంగాలకు చెందిన విద్యా వ్యవస్థల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు.

క్యాబినెట్ సమావేశానికి ముందే ఎజెండా బయటకు వెళుతోందన్న ఫిర్యాదులు రావడంలో తొలిసారిగా మంత్రులకు వీపీఎన్ (వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్) ద్వారా ఎజెండా పంపారు.

**దిల్లీలో కొత్తగా నిర్మించే ఏపీ భవన్ నమూనాలపై ప్రజంటేషన్**

దిల్లీలో కొత్తగా నిర్మించనున్న ఏపీ భవన్ నమూనాలపై పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ మంత్రులకు ప్రజంటేషన్ ఇచ్చారు. సీఎం మాట్లాడుతూ... 'దిల్లీలోని ఏపీ భవన్ సరిపోవడం లేదని, హైదరాబాద్ ప్యాలెస్‌ను కేటాయిస్తే అక్కడ ఏపీ భవన్ ఏర్పాటు చేసుకుంటామని వాజ్‌పేయీ ప్రధానిగా ఉండగా కోరాం. హైదరాబాద్ ప్యాలెస్ జాతీయ, అంతర్జాతీయ సమావేశాలకు వేదికగా నిలుస్తోందని, ప్రత్యేక గుర్తింపు పొందిన ఆ భవనాన్ని ఒక రాష్ట్రానికి పరిమితం చేయడం సబబు కాదని కేంద్రం తెలిపింది. దానికి బదులుగా అప్పట్లో మరోచోట 10 ఎకరాలు ఏపీ భవన్‌కు కేటాయించారు. ఆ 10 ఎకరాల్లో ఇప్పుడు మనకు వచ్చిన ఐదెకరాల్లో ఏపీ భవన్‌ను కడుతున్నాం' అని అన్నారు.

# పదిలో 85.25% పాస్

-మొదటిపేజీ తరువాయి

ఏపీకి తరలివస్తున్న భారీ పెట్టుబడులు, విప్లవాత్మక ప్రాజెక్టుల కంటే విద్యాశాఖ మంత్రిగా పదోతరగతి పరీక్షల ఫలితాల్లో కనిపిస్తున్న స్థిరమైన పురోగతి తనకు ఎక్కువ సంతృప్తినిస్తోందని పేర్కొన్నారు. ఫలితాలు విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయులు, కుటుంబాల మద్దతును ప్రతిబింబిస్తున్నాయని వెల్లడించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. అనుత్తీర్ణులైన వారు నిరాశ చెందకుండా కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు, సమాజం మద్దతుతో తిరిగి విజయం సాధించాలని సూచించారు. ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా 96.07% ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో ఉండగా.. అల్లూరి సీతారామరాజు జిల్లా 57.12% ఉత్తీర్ణతతో అట్టడుగున నిలిచింది.

**రెండు వేలకు పైగా పాఠశాలల్లో అందరూ పాస్**

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,089 పాఠశాలల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. వాటిల్లో 2,161 బడుల్లో అందరూ ఉత్తీర్ణులయ్యారు. 16 పాఠశాలల్లో అందరూ ఫెయిలయ్యారు. యాజమాన్యాల వారీగా చూస్తే ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు 96.04% ఉత్తీర్ణతతో మొదటిస్థానంలో నిలిచాయి. వీటిలో 2015 నుంచి 2019 వరకు 91%పైగా ఉత్తీర్ణత నమోదు కాగా.. కరోనా తర్వాత 2022లో 67.26 శాతానికి పడిపోయింది. 2024లో 86.69% మంది పాసయ్యారు. కరోనా తర్వాత అత్యధిక ఉత్తీర్ణత ఇదే. గతేడాది 81.14% ఉత్తీర్ణత నమోదు కాగా.. ఈసారి 4.11% పెరిగింది.

**మొదటి శ్రేణిలోనే అత్యధికం**

ఉత్తీర్ణులైన 5,26,954 మందిలో 4,40,995 (83.69%) మంది మొదటిశ్రేణిలో పాస్ అయ్యారు. ద్వితీయశ్రేణిలో 62,572 (11.87%)మంది, మూడో డివిజన్‌లో 23,387 (4.44%) మంది ఉత్తీర్ణులయ్యారు.

అత్యధికంగా విశాఖపట్నం జిల్లా నుంచి 22,977 మంది మొదటి డివిజన్‌లో పాస్ కాగా.. తర్వాత స్థానంలో 22,772 మందితో ప్రకాశం జిల్లా నిలిచింది. ద్వితీయ డివిజన్ 4,529 మంది, తృతీయ డివిజన్ 2,333 మందితో కర్నూలు మొదటి స్థానంలో ఉండగా.. ద్వితీయ డివిజన్ 3,561 మంది, తృతీయ డివిజన్ 1,611 మందితో అనంతపురం జిల్లా రెండో స్థానంలో నిలిచింది.

**తెలుగు మాధ్యమానికి గడ్డు కాలం**

తెలుగు మాధ్యమంలో చదివేవారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. 2024లో 1.61 లక్షల మంది తెలుగుమాధ్యమంలో పరీక్షలు రాయగా.. 2025లో 49,519 మంది, ఈ ఏడాది 30,129 మందే రాశారు. ఈ సంవత్సరం రాసినవారిలో 19,834 (65.83%) మంది ఉత్తీర్ణులయ్యారు. మాతృభాష సబ్జెక్టులోనూ 6.05% మంది అనుత్తీర్ణులయ్యారు. ఆంగ్ల మాధ్యమంలో 5,83,645 మంది పరీక్షలు రాయగా.. 5,03,539 (86.28%) మంది పాసయ్యారు.

**సైన్సులో ఎక్కువ తప్పారు**

పదోతరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల్లో ఎక్కువమంది సామాన్యశాస్త్రంలో అనుత్తీర్ణులయ్యారు. తర్వాత గణితంలో ఎక్కువమంది ఫెయిలయ్యారు. సామాన్యశాస్త్రం పరీక్షకు 6,17,745 మంది హాజరు కాగా.. 5,63,855 (91.28%) మంది పాసయ్యారు. గణితానికి వచ్చేసరికి 6,17,670 మంది పరీక్ష రాయగా.. 5,78,403 (93.64%) మంది ఉత్తీర్ణులయ్యారు. హిందీలో అత్యధిక ఉత్తీర్ణత 99.82% నమోదైంది.

# సముద్రంలో ముంచేస్తాం

అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. శాంతి చర్చలు దాదాపుగా అటకెక్కిన వేళ.. ఇరు దేశాల మధ్య విభేదాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. అణ్వస్త్ర తయారీ ప్రణాళికలను వదులుకోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్‌కు టెహ్రాన్ ససేమిరా అంటోంది. తమ అణు, క్షిపణి సామర్థ్యాలను జాతీయ సంపద తరహాలో కాపాడుకుంటామని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తాజాగా ఉద్ఘాటించారు. హర్మూజ్‌పై తమ నియంత్రణ కొనసాగుతుందని, అందుకోసం కొత్త నిబంధనలు తీసుకొస్తామని స్పష్టం చేశారు. పర్షియన్ గల్ఫ్‌కు వచ్చే అమెరికన్లను సముద్రంలో ముంచేస్తామని హెచ్చరించారు. చమురు ధరలు భారీగా పెరుగుతుండటంతో ఒకింత ఒత్తిడి ఎదుర్కొంటున్న ట్రంప్.. హర్మూజ్‌ను తిరిగి తెరిచేందుకు కొత్త ప్రణాళికను ప్రతిపాదించారు. దాని ప్రకారం- ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని అమెరికా కొనసాగిస్తుంది. అదే సమయంలో.. ఇంధన స్వేచ్ఛా ప్రవాహానికి విఘాతం కలిగించే ప్రయత్నాలకు టెహ్రాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చేలా మిత్రపక్షాలను సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపడుతుంది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర గురువారం ఏకంగా 126 డాలర్లకు ఎగబాకింది.

**గల్ఫ్ చరిత్రలో సరికొత్త అధ్యాయం**

ఇరాన్‌లో పర్షియన్ గల్ఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొజ్తాబా ఖమేనీ రాతపూర్వక సందేశం విడుదల చేశారు. "దేశం లోపల, వెలుపల ఉన్న 9 కోట్ల మంది ఇరానియన్లు.. నానోటెక్నాలజీ, బయోటెక్నాలజీ నుంచి అణు, క్షిపణి సామర్థ్యాల వరకు ఇరాన్ గుర్తింపు-ఆధారిత, ఆధ్యాత్మిక, మానవ, శాస్త్రీయ, పారిశ్రామిక, సాంకేతిక సామర్థ్యాలన్నింటినీ జాతీయ ఆస్తులుగా భావిస్తారు. వారు దేశ జలాలు, భూమి, గగనతలాన్ని ఎలాగైతే కాపాడుకుంటారో.. ఈ సామర్థ్యాలనూ అలాగే రక్షించుకుంటారు" అని అందులో పేర్కొన్నారు. "దేవుడి దయవల్ల పర్షియన్ గల్ఫ్ ఉజ్వల భవిష్యత్తులో అమెరికా ప్రమేయం ఉండదు. హర్మూజ్ కోసం చట్టబద్ధమైన కొత్త నిబంధనలను మేం తీసుకువస్తాం. అవి గల్ఫ్ దేశాలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తాయి. ప్రాంతీయంగా శాంతిని నెలకొల్పుతాయి. హర్మూజ్, గల్ఫ్ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలవుతోంది" అని కూడా మొజ్తాబా తెలిపారు. అమెరికాను 'పెద్ద సైతాను'గా మొజ్తాబా అభివర్ణించారు. పర్షియన్ గల్ఫ్‌లో అమెరికన్లకు పనేంటని ప్రశ్నించారు. "అత్యాశ, దుర్బుద్ధితో వేల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే విదేశీయులకు.. పర్షియన్ గల్ఫ్‌లో నీటి అడుగున తప్ప మరెక్కడా స్థానం ఉండదు. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలు వాటినవే కాపాడుకోలేకపోతున్నాయి. అలాంటప్పుడు తమపై ఆధారపడిన దేశాల భద్రతకు అవి ఎలా హామీ ఇవ్వగలవు" అని ఆయన ప్రశ్నించారు. హర్మూజ్‌లో శత్రువుల దురాగతాలను ఇరాన్ నిర్మూలిస్తుందన్నారు.

**అమెరికాకు గుండెపోటే**

శత్రు బలగాలపై త్వరలోనే కొత్త ఆయుధంతో విరుచుకుపడతామని ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్ ఇరానీ హెచ్చరించారు. ఆ ఆయుధం అమెరికాను తీవ్రంగా భయపెడుతుందని, దానికి గుండెపోటు కూడా తెప్పిస్తుందని వ్యాఖ్యానించారు. అమెరికా బలగాలు దిగ్బంధనం కొనసాగిస్తున్నప్పటికీ తమ నౌకలు కొన్ని.. రాకపోకలు సాగిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తమ ప్రజల కోసం చివరి రక్తపు బొట్టు వరకూ పోరాడి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు.

తమ లక్ష్యాలను పూర్తిస్థాయిలో అందుకునేందుకు ఇరాన్‌పై త్వరలోనే మళ్లీ దాడులు చేసే అవకాశముందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ పేర్కొన్నారు.

అమెరికా బలగాల దిగ్బంధనంతో సతమతమవుతున్న ఇరాన్‌కు సాయపడేలా.. ఆ దేశానికి తమ ఆరు అత్యవసర భూ మార్గాలను పాకిస్థాన్ తెరిచింది. ఇరాన్‌కు సరకు రవాణా కొనసాగేలా ఈ చర్య దోహదపడనుంది.

# బెంగాల్ గరంగరం

ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా పశ్చిమబెంగాల్‌లో వేడి తగ్గకపోగా పెరుగుతోంది. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే ఈసారి గెలిచేందుకు అవకాశం ఉందని ఎక్కువశాతం ఎగ్జిట్‌పోల్స్ చెబుతుండటంతో కమలనాథులు రెట్టించిన ఉత్సాహంతో విజయోత్సవాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు అధికార తృణమూల్ కాంగ్రెస్‌లో కలవరం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈవీఎంలను మార్చేస్తున్నారన్న ఆరోపణలపై గురువారం కోల్‌కతాలో హైడ్రామా నడిచింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా ధర్నాకు దిగారు. తాను పోటీచేసిన భవానీపూర్ నియోజకవర్గంలో ఈవీఎంలలో మతలబులు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో.. భోరున కురుస్తున్న వర్షాన్నీ లెక్కచేయకుండా గురువారం రాత్రి స్ట్రాంగ్‌రూం వద్దకు మమత చేరుకున్నారు. చాలాసేపు అక్కడే బైఠాయించారు. దీంతో ఉద్రిక్తత తలెత్తింది. కోల్‌కతాలోని 'ఖుదీరాం అనుశీలన్ కేంద్ర'లోనూ తృణమూల్ అభ్యర్థులు ధర్నాకు దిగారు. అధీకృత ప్రతినిధులు లేకుండా "బ్యాలెట్ బాక్సు"ల్ని తెరిచే ప్రయత్నం చేస్తున్నట్లు సీసీటీవీ ఫుటేజీ చూపిస్తోందని, ఇదంతా ఈసీకి తెలిసే జరుగుతోందని తృణమూల్ ఆరోపించింది. ఈసీ వీటిని ఖండించింది. స్ట్రాంగ్‌రూంలు భద్రంగానే ఉన్నాయని స్పష్టం చేసింది. పోస్టల్ బ్యాలెట్లకు అదేచోట విడిగా స్ట్రాంగ్‌రూంలు కేటాయించామని తెలిపింది. బ్యాలెట్ల విభజనను నిర్ణీత నిబంధనల ప్రకారమే చేస్తున్నట్లు వివరించింది. హింసను రెచ్చగొట్టేవారిని తక్షణం అరెస్టు చేయాలని బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్ అగర్వాల్ ఆదేశించారు. కౌంటింగ్‌లో కేంద్ర సిబ్బందిని వినియోగించవద్దంటూ తృణమూల్ వేసిన పిటిషన్‌ను కలకత్తా హైకోర్టు కొట్టివేసింది.

**టుడేస్ చాణక్యదీ అదే మాట...**

పశ్చిమ బెంగాల్‌లో 294కి గానూ 192 స్థానాలు భాజపాకు, 100 సీట్లు తృణమూల్‌కు వస్తాయని 'టుడేస్ చాణక్య' సంస్థ ఎగ్జిట్‌పోల్ లెక్కగట్టింది. ఈ సంస్థ గురువారం తన అంచనాలు వెల్లడించింది. కేరళలో 140 స్థానాలకు 69 యూడీఎఫ్‌కు, 64 ఎల్డీఎఫ్‌కు వస్తాయని తెలిపింది. అస్సాంలో 102 సీట్లతో భారీ భాజపా భారీ విజయం అందుకోబోతోందని పేర్కొంది. తమిళనాడులో అధికార డీఎంకే కూటమి మరోసారి అధికారంలోకి రానుందని కూడా అంచనా వేసింది.

**2 నిమిషాలకు మించి వెళ్లొద్దు**

అంతకుముందు మమత ఒక వీడియో సందేశం వెలువరించారు. అందులో ఎగ్జిట్‌పోల్స్‌ను కొట్టిపడేశారు. వీటిని భాజపా ఆదేశాల ప్రకారం రూపొందించారని, కచ్చితంగా తప్పు అవుతాయని పేర్కొన్నారు. ఓట్లలెక్కింపు రోజు తాను చెప్పేవరకు ఏజెంట్లలో ఏ ఒక్కరూ ఆయా కేంద్రాలను వీడొద్దని చెప్పారు. తినడానికైనా, లఘుశంకకైనా రెండు నిమిషాలకు మించి కేటాయించవద్దని దిశానిర్దేశం చేశారు. 294కి గానూ 226 పైబడిన స్థానాల్లో విజయం సాధించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. "స్టాక్ మార్కెట్టును పెంచేందుకు, మా శ్రేణుల్ని నైతికంగా దెబ్బ తీసేందుకు భాజపా కార్యాలయం నుంచి రూపొందించిన అంచనాలను ప్రసారం చేశారు. తరలింపు సమయంలో ఈవీఎంలను మార్చేయకుండా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి.

# కోహినూర్‌ను భారత్‌కు ఇచ్చేయమని అడుగుతా

-మొదటిపేజీ తరువాయి

రాణి కెమిల్లా ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్నారు. న్యూయార్క్‌లోని 9/11 స్మారక చిహ్నాన్ని వారు సందర్శించారు. ఈ కార్యక్రమానికి ముందు మమ్దానీ మీడియాతో మాట్లాడుతూ.. రాజుతో విడిగా మాట్లాడే అవకాశం వస్తే కోహినూర్‌ను ప్రస్తావిస్తానని చెప్పారు. ఆ తర్వాత బ్రిటన్ రాజుతో ఆయన మాట్లాడినప్పటికీ వారిద్దరి మధ్య కోహినూర్ ప్రస్తావన వచ్చిందా.. లేదా అనేది స్పష్టంగా తెలియలేదు. న్యూయార్క్ మేయర్ వ్యాఖ్యలపై స్పందించేందుకు బకింగ్‌హామ్ ప్యాలెస్ నిరాకరించింది. 105.6 క్యారెట్ల కోహినూర్ వజ్రాన్ని మహారాజా దులీప్ సింగ్ 1849లో విక్టోరియా రాణికి ఇచ్చారు. ఆ తర్వాత రాణి కిరీటంలో అలంకరించిన ఈ వజ్రం అప్పటినుంచీ బ్రిటన్ రాజవంశం అధీనంలోనే ఉంది.

## గూడూరు గుభేల్..45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

-మొదటిపేజీ తరువాయి

ఇదే గరిష్ఠం. మేలో ఇంకా ఎక్కువ నమోదు కావొచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో 28 మండలాలు, వైఎస్సార్ కడపలో 26, తిరుపతిలో 25, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరులో 25, ప్రకాశంలో 22, మార్కాపురంలో 15, నంద్యాలలో 14, చిత్తూరులో 13, గుంటూరు జిల్లాలోని 11 మండలాల్లో గురువారం 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 45.2, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 45, తిరుపతి జిల్లా రాయలచెరువులో 44.3, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా వలేటివారిపాలెం, బాపట్ల జిల్లా కారంచేడు, చిత్తూరు జిల్లా తవణంపల్లె, నంద్యాల జిల్లా సంజామ, వైఎస్సార్ జిల్లా కోడూరులో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

**మండుతున్న మార్కాపురం**

గతంలో పల్నాడు జిల్లా రెంటచింతలలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. ఈ ఏడాది మార్కాపురం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల ఉష్ణోగ్రతలు ఆ రికార్డులను దాటేసేలా ఉన్నాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ నివేదికల ప్రకారం ఏప్రిల్ 27న మార్కాపురం జిల్లా బేస్తవారిపేట, కంభం మండలాల్లో 2 చోట్ల 45.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో 9 మండలాల్లో 43 డిగ్రీలు దాటాయి. గత నెల 26, 28న కూడా రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలూ మార్కాపురం జిల్లాలోనే రికార్డయ్యాయి. అదే సందర్భంలో రెంటచింతలలో గతంలో కంటే ఉష్ణోగ్రతలు తగ్గాయి. గురువారం రాష్ట్రంలో చాలా మండలాల్లో 45 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు రికార్డయితే.. రెంటచింతలలో మాత్రం 41.2 డిగ్రీలు నమోదైంది.

## ఘోర రోడ్డు ప్రమాదం.. 17 మంది మృతి

-మొదటిపేజీ తరువాయి

. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెప్పారు. జల్‌జలాలోని వైశాఖ పౌర్ణమి వేడుకలకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు వివరించారు.మరో వైపు నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రహదారిపై భారీగా బురద వచ్చి చేరింది. ఈ నేపథ్యంలో వేగంగా వెళ్తున్న జీపు.. భారీ లోయలో పడిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రతికూల వాతావరణం కారణంగా సహాయక చర్యలకు ఆటంకం కలిగిందని అధికారులు వివరించారు.

## వైజాగ్ స్టీల్‌కు మరో 8వేల కోట్లు

-మొదటిపేజీ తరువాయి

తెలిసింది. ఆర్థికశాఖ వ్యయవిభాగం పచ్చజెండా ఊపిన వెంటనే ఈ అంశం కేంద్ర మంత్రివర్గం ముందుకు వెళ్లనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌ల ప్రారంభంతో ప్లాంట్ కార్యకలాపాలు స్థిరంగా సాగుతున్నాయి. ఉక్కు ఉత్పత్తి, అమ్మకాలు కూడా పెరిగాయి. ఇది ఇలాగే దీర్ఘకాలం కొనసాగేందుకు అవసరమైన చేయూతనందించేందుకే కేంద్ర ప్రభుత్వం రెండోదశ ప్యాకేజీలో భాగంగా రూ.8,097 కోట్లు అందించడానికి సిద్ధమైనట్లు అధికారవర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రాగానే కేంద్రాన్ని సంప్రదింపులు జరపడంతో తొలిదశలో రూ.11,440 కోట్ల ప్యాకేజీ అందింది. అందులో రూ.10,300 కోట్లు ఈక్విటీ రూపంలో, మరో రూ.1,140 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ రుణాలను 7% నాన్ క్యుములేటివ్ రిడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్ల రూపంలో సమకూర్చింది. ఇప్పుడు కూడా ఈ రూ.8,097 కోట్లను ఈక్విటీ రూపంలో సమకూర్చాలని కేంద్ర ఉక్కుశాఖ నిర్ణయించింది.

## అత్యాచార బాధితుల కోసం గర్భవిచ్ఛిత్తి చట్టాన్ని మార్చండి

-మొదటిపేజీ తరువాయి

సుప్రీంకోర్టు పేర్కొంది. పిండం వయసు 20 వారాలు దాటిన తర్వాత కూడా దానిని తొలగించుకునేందుకు అనుమతించేలా చట్టాన్ని మార్చాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. అత్యాచార బాధితులకు వారి శరీరంపై ఉన్న స్వయం నిర్ణయాధికారాన్ని గుర్తించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం స్పష్టం చేసింది. పదిహేనేళ్ల బాలిక మోస్తోన్న 30 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు అత్యున్నత న్యాయస్థానం ఇటీవల అనుమతించింది. అలా చేయడం మైనర్ తల్లి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, భవిష్యత్తులో బిడ్డల్ని కనలేదని పేర్కొంటూ ఎయిమ్స్ వైద్యులు క్యూరేటివ్ పిటిషన్ వేశారు. 'ప్రసవానికి ఇంకా నాలుగు వారాల వ్యవధే ఉంది కాబట్టి బిడ్డకు జన్మనిచ్చి, దత్తతకు ఇచ్చే అంశాన్ని పరిశీలించవచ్చు. ఇదంతా ఆ బాలిక క్షేమం కోసమే'నని ఎయిమ్స్ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి గురువారం సుప్రీం ధర్మాసనానికి తెలిపారు. 'బాలికపై అత్యాచారం జరిగిన కేసు ఇది. ఆ ఘటన తాలూకు క్షోభ ఆమెను జీవితాంతం వెంటాడుతుంది. ఆ బాలిక ఆరోగ్యంపై శాశ్వత ప్రభావం లేకపోతే గర్భాన్ని తొలగించాలి. ఆరోగ్య సమస్యల విషయంలో బాధితురాలి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వండి. వారు సముచిత నిర్ణయం తీసుకోవడంలో సహాయం చేయండి' అని ధర్మాసనం పేర్కొంది.

## అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో పారిశ్రామిక, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యా కోర్సులను పునర్‌వ్యవస్థీకరిస్తున్నామని, విద్యార్థులకు ప్రపంచస్థాయి నైపుణ్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యాశాఖలో చేపడుతున్న సంస్కరణలను ముఖ్యమంత్రికి వివరించారు.ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు పాఠ్యాంశాలను మార్పు చేయడంతో పాటు, విద్యార్థులకు బ్రిడ్జి కోర్సులు కూడా అందిస్తున్నామని లోకేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌సీఆర్టీ సహకారంతో ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా పాఠ్యాంశాలను తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. బోధనా పద్ధతులపై అధ్యయనం చేసేందుకు అత్యుత్తమ ఉపాధ్యాయులను ఫిన్‌లాండ్ వంటి దేశాలకు పంపుతున్నామని వివరించారు. 'టీచర్-స్టూడెంట్-అవుట్‌కమ్' అనే విధానంలో విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామన్నారు. 'బడి కోసం' కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# నర్సంపేటలో ప్లాస్టిక్ నిషేధం- కఠిన చర్యలకు మున్సిపాలిటీ సిద్ధం



**నర్సంపేట :పెన్ సత్తా** నర్సంపేటలో ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు పురపాలక సంఘం కఠిన నిర్ణయం తీసుకుంది. 120 మైక్రాన్ లోపు ఉన్న ప్లాస్టిక్ సంచుల అమ్మకాలు, వినియోగాన్ని నిషేధించింది. మున్సిపాలిటీ చట్టం--2019 ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ అంశంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 2న వ్యాపారులు, హోటల్ యాజమాన్యాలతో మున్సిపల్ కమిషనర్ భాస్కర్ సమావేశం నిర్వహించనున్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ప్రజలను కోరారు.

# మే 3న భద్రాచలంలో హిందూ సమ్మేళనం



**భద్రాచలంపెన్ సత్తా ఏప్రిల్30:**భద్రాచలం జూనియర్ కళాశాల మైదానంలో మే 3 ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న "హిందూ సమ్మేళనం" కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి భద్రాచలం, సారపాక (సాకేతపురి), దుమ్ముగూడెం పరిసర ప్రాంత ప్రజలు ప్రాంతాల నుండి హిందూ బంధువులు అశేష సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం భద్రాచలం పట్టణంలోని తెలంగాణ టూరిజం హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించరు . ఈ సమావేశంలో హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, "గడప లోపల కులం… గడప దాటితే మనమంతా హిందువులం!" అనే నినాదంతో ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఉన్న భేదాలను పక్కన పెట్టి, ఐక్యంగా నిలబడే సందేశాన్ని ప్రతి ఇంటికీ చేర్చడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో ఈ సమ్మేళనం చారిత్రాత్మకంగా నిలవాలని ఆకాంక్షించారు. శ్రీ శివనాగస్వామి మాట్లాడుతూ, హిందూ సమాజంలో ఐక్యతను పెంపొందించడం, ధార్మిక మరియు సాంస్కృతిక విలువలను రక్షించడం ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని వివరించారు. భిన్నతలు ఉన్నా మనమంతా ఒకటే అన్న భావనతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ మహా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనం భద్రాచలం నగర ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.వి. సుబ్రహ్మణ్యం, కోశాధికారి నాగభూషణ శాస్త్రి, కుంజా సంతోష్, గోపి కిషోర్, ఎ. శ్రీనివాస రెడ్డి, సిద్ధార్థ, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# లోన్ మాయలో రూ.1.25 లక్షల దోపిడి... నాగోల్‌లో సైబర్ మోసం..

రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, పెన్ సత్తా తక్కువ వడ్డీతో లోన్ ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి ఓ ఉపాధ్యాయుడిని రూ.1.25 లక్షలు మోసం చేసిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. నాగోల్ ఇన్స్పెక్టర్ మొహమ్మద్ మక్బూల్ జాని తెలిపిన వివరాల ప్రకారం... సాయినగర్ కాలనీకి చెందిన కొప్పుల లింగారెడ్డి (46)కి ఈ నెల 2న అనామక కాల్ వచ్చింది. కాల్ చేసిన వ్యక్తి తాను ఐసీఐసీఐ బ్యాంక్ నానక్రామ్‌గూడ శాఖకు చెందినవాడినని చెప్పి తక్కువ వడ్డీతో లోన్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. సిబిల్ స్కోర్ తక్కువగా ఉందని చెప్పి ప్రాసెసింగ్, డాక్యుమెంట్ ఛార్జీల పేరుతో డబ్బులు వసూలు చేశాడు. మోసగాడి సూచనల మేరకు బాధితుడు మూడు విడతల్లో రూ.50వేలు, రూ.50వేలు, రూ.25వేలు ఫోన్‌పే ద్వారా పంపించాడు. మొత్తం డబ్బు అందుకున్న తర్వాత నిందితుడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పరారయ్యాడు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేసి, నాగోల్ పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ మొహమ్మద్ మక్బూల్ జాని తెలిపారు.

# ఘనంగా చిల్డ్రన్స్ పార్లమెంట్, బాల పంచాయత్ కార్యక్రమం

- ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద
- తల్లిదండ్రులు మొత్తం పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి
- ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలి-వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద




**చెన్నారావుపేట పెన్ సత్తా :** వరంగల్ జిల్లాలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో చిల్డ్రన్స్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా బాల పంచాయతీ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద,జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు పార్లమెంట్ విధానాన్ని అనుకరించి చర్చలు, వివిధ సమస్యలపై అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ ప్రజాస్వామ్య పద్ధతులను ప్రదర్శించారు. వివిధ రకాల సమస్యలను గురించి ప్రస్తావించారు. వాటికి పరిష్కార మార్గాలను వెతికారు. లీడర్లుగా ఎదిగేందుకు దోహదమయ్యే అంశాలను గురించి చర్చించారు.

15 మంది విద్యార్థులతో బాల పంచాయతీ నిర్వహించారు.

విద్యార్థుల ప్రతిభను ప్రశంసించిన ముఖ్య అతిథులు, చిన్న వయస్సులోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు.

వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ, చిల్డ్రన్స్ పార్లమెంట్ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుత భావన పెరుగుతాయని చెప్పారు. పదవ తరగతిలో 500 మార్కులకు పైగా పలువురు విద్యార్థులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మండల స్థాయిలో ప్రభుత్వ విభాగంలో 530 మార్కులు పొందిన అక్షితను అభినందించారు. తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని, అత్యున్నత అర్హతలు కలిగిన అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులు సానుకూల ధోరణితో ఉండి తమ పిల్లల్ని చేర్పించాలని కోరారు.

జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి

విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

విద్యార్థులతో ప్రజాస్వామ్య పద్ధతులను గురించి, పార్లమెంటరీ విధానం గురించి వివిధ రకాల కృత్యాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి డాక్టర్ బాలకృష్ణ, తాసిల్దార్, ఉప్పరపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం తేజావత్ జయ, వివిధ శాఖల అధికారులు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో ఖర్చులను తగ్గించుకొని అధిక దిగుబడులు పొందవచ్చు

- శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ శ్రవణ్.
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్



**నర్సంపేట పెన్ సత్తా :** :ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమంలో భాగంగా నర్సంపేట మండలం ద్వారక పేట పస్సునూరు లో ప్రాంతీయ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్ వారి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అనుబంధంతో రైతులకి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొదటగా శాస్త్రవేత్తలు రైతులకి ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాలను వివరించారు. రైతులు తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించడం, అవసరం మేరకు రసాయనాలను వినియోగించి నేల ఆరోగ్యం కాపాడడం పంట మార్పిడిని పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందడం సాగు నీటిని ఆదా చేయడం,మార్కెట్లో గిరాకీ ఉన్న వరి రకాలను పండించి అధికాఅదాయాన్ని ఆర్జించడం సేంద్రియ పద్ధతులను పాటించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఆస్వాదించడం వంటి అంశాలని చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సంపేట మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గంధం నరేందర్ పాల్గొని మాట్లాడుతూ విశ్వవిద్యాలయం వారు ఏర్పాటు చేసిన ఈ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం గ్రామ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయం వారు రూపొందించిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అవలంబిస్తూ సాగు ఖర్చులను తగ్గించుకొని అధిక దిగుబడులు పొందాలని తెలియజేశారు. వానకాలానికి అనువైన వరి రకాలైన కూనారం 1638, వరంగల్ సిద్ది రాజేంద్రనగర్ నుంచి విడుదలైన ఆర్ఎన్ఆర్ 15048 రకాల గురించి తెలియజేశారు. ఎండు తెగులు తట్టుకొనే రకాలు తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి కృష్ణ కుమార్ మాట్లాడుతూ నేల ఆరోగ్య పరిరక్షణ గురించి వివరిస్తూ అధిక రసానిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సేంద్రియ ఎరువుల వాడకం వలన పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి నేలలో కర్బన శాతం పెరుగుతుందని తెలియజేశారు. వరికి ముందు పచ్చి రొట్ట ఎరువులు సాగు చేసి భూమిలో కలియదున్నడం వల్ల పంటలో వేసే యూరియా శాతాన్ని తగ్గించుకోవచ్చని అన్నారు. భూసార పరీక్షల ఆవశ్యకత భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వేయడం యొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. కూరగాయలలో తెగుళ్లు అలాగే చీడపీడల సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి తెలియజేశారు. అదేవిధంగా రైతులకు అందుబాటులో ఉన్న వివిధ సమాచార సాధనాలైన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం యూట్యూబ్ ఛానల్, వ్యవసాయ మాసపత్రిక కిసాన్ సారథి ద్వారా రైతులకు అందిస్తున్న సమాచార సేవలను గురించి రైతులకి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అశోక్,ఉద్యానవన అధికారి ఏ జ్యోతి,విస్తరణ అధికారి అభ్యుదయ, రైతులు తోట అశోక్,చీర వేణు, నరసింహ,ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# శేఖాపూర్‌లో మొక్కజొన్న పంటకు అగ్ని ప్రమాదం



**యాదగిరి కామారెడ్డి పెన్ సత్తా :** :బాధిత రైతులను పరామర్శించిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం శేఖాపూర్ గ్రామంలో నిన్న రాత్రి పంట పొలాల్లో మొక్కజొన్న పంటకు అగ్ని ప్రమాదం సంభవించి విస్తారంగా పంట కాలిపోయింది. ఈ ఘటనతో రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్నారు.

విషయం తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు గురువారం ఉదయం వెంటనే గ్రామానికి చేరుకుని బాధిత రైతుల పొలాలను పరిశీలించారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి నష్ట వివరాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి ఘటనపై పూర్తి సమాచారం సేకరించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అలాగే పంట నష్టాన్ని అంచనా వేసి తక్షణమే నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.

రైతులు ఎదుర్కొన్న నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

# నకిలీ విత్తనాలు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు!

మండల స్థాయి ఎరువుల టాస్క్ ఫోర్స్ బృందం వెల్లడి






**యాదగిరి కామారెడ్డి పెన్ సత్తా :** పిట్లం: మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తన దుకాణాల్లో గురువారం మండల స్థాయి టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించారు. ఈ బృందంలో మండల వ్యవసాయ అధికారి వినోద్, తహశీల్దార్ మహేందర్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆంజనేయులు సభ్యులుగా ఉన్నారు. తనిఖీల్లో భాగంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి, గోడౌన్లలో ఉన్న నిల్వలతో సరిపోల్చారు. నిల్వలలో తేడాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు మాత్రమే నిబంధనల ప్రకారం యాప్ ద్వారా విక్రయించాలని సూచించారు.రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కేవలం ధృవీకరించబడిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. నిల్వల పట్టికను దుకాణం ముందు ప్రదర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఎవరైనా గ్రామాలలో లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే రైతులు కొనుగోలు చేయవద్దని, వారి వివరాలను అందించాలని, అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మిక, కర్షకుల సంక్షేమమే లక్ష్యంగా కె.సి.ఆర్ సుపరిపాలన

కార్మికులకు అండగా నిరంజన్ రెడ్డి ఎజెండా




**వనపర్తి జిల్లా: పెన్ సత్తా** :బి.ఆర్.టి.యు ఆధ్వర్యంలో నిర్వహించనున్న "మే డే" ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్ కార్మిక సంఘాలను సమాయత్తం చేశారు.

నందిమల్ల అశోక్ మాట్లాడుతూ, పట్టణంలోని కార్మిక సంఘాలు బి.ఆర్.ఎస్ పార్టీకి అండగా నిలవడం నిరంజన్ రెడ్డి నిష్పక్షపాత సుపరిపాలనకు నిదర్శనం అని అన్నారు. ప్రారంభం నుంచే కార్మిక సంఘాల సమస్యలను నిరంజన్ రెడ్డి, రావుల చంద్రశేఖర రెడ్డి అర్థం చేసుకుని వారికి అండగా నిలిచారని కొనియాడారు.

రాష్ట్ర బి.ఆర్.టి.యు ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రేపు ఉదయం 8:30 గంటలకు స్థానిక రాజీవ్ చౌరస్తాలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరవుతారని, కార్మిక సంఘాలు మరియు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు తాత రాములు, యాదయ్య, తోపుడు బండ్ల సంఘం అధ్యక్షుడు నాగశేషి తదితరులు పాల్గొన్నారు.

# చర్ల సీహెచ్‌సీలో ఆరు నెలల్లో 100 శస్త్రచికిత్సలు

స్థానిక గిరిజనులకు వరంగా మారిన ప్రభుత్వాసుపత్రి.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా** :,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిసర ప్రాంతాలకు వైద్య సేవల్లో కీలకమైన చర్ల ప్రభుత్వ ఆసుపత్రి గత ఆరు నెలల్లో 100 ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి మరో మైలురాయిని సాధించింది.

గతంలో చర్ల ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో ట్యూబెక్టమీ వంటి శస్త్రచికిత్సల కోసం రోగులు 56 కి.మీ దూరంలోని ఏరియా ఆసుపత్రి భద్రాచలం వరకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో రోగులపై ఆర్థిక భారం, శారీరక ఇబ్బందులు అధికంగా ఉండేవి. ప్రస్తుతం సిజేరియన్ వంటి ప్రధాన శస్త్రచికిత్సల తో పాటు అత్యాధునిక టిఫా స్కానింగ్ సేవలు కూడా అందుబాటులోకి రావడం గమనార్హం. భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు సూచన మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ శ్రీ జితేశ్ పాటిల్ ప్రత్యేక దృష్టి సారించి ఆరు నెలల క్రితం చర్ల ఆసుపత్రిలో నూతన ఆపరేషన్ థియేటర్ ను ఏర్పాటు చేసి అవసరమైన పరికరాలు సమకూర్చారు. అలాగే మాతృ సేవలకు అవసరమైన ప్రసూతి, పిల్లల, మత్తు వైద్య నిపుణులను నియమించారు. దీంతో స్థానికంగా అన్ని వైద్య సేవలు అందుబాటులోకి వచ్చి గిరిజన ప్రాంతాల ప్రజలకు పెద్ద ఊరట లభించింది.

**జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక దృష్టి:**

ప్రస్తుతం జిల్లా కలెక్టర్ శ్రీ అంకిత్ చర్ల ఆసుపత్రిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇటీవలే ఒక రేడియాలజిస్ట్ వైద్య నిపుణురాలిని నియమించారు. అలాగే అత్యవసర సేవలు నిరంతరంగా అందుబాటులో ఉండేలా ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులు, ముగ్గురు శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేశారు.

**మరింత విస్తృత సేవల దిశగా కృషి -- డీసీహెచ్ఎస్ డా. రవి బాబు:**

డీసీహెచ్ఎస్ డా. రవి బాబు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ నేతృత్వంలో భద్రాచలం శాసనసభ్యులు డా. తెల్లం వెంకట్రావు మద్దతుతో మరింత విస్తృత వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 100 ట్యూబెక్టమీ శస్త్రచికిత్సల మైలురాయి సాధించినందుకు చర్ల ఆసుపత్రి వైద్య బృందం డా. కె. శ్రావణి, డా. కె. శివ రామకృష్ణ ప్రసాద్ మరియు ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని అభినందించారు. అవసరమైన మద్దతు అందించిన జిల్లా కలెక్టర్ శ్రీ అంకిత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఓపీ గదుల ఏర్పాటు, పరికరాల మంజూరు చేసిన ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపారు. చర్లలో నిర్మాణంలో ఉన్న 30 పడకల నూతన భవనం పూర్తయిన తర్వాత మరింత మెరుగైన వైద్య సేవలు అందించగలమని పేర్కొన్నారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు:**

చర్ల ఆసుపత్రిలో అందుతున్న సేవల పట్ల పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతి చిన్న అవసరానికీ భద్రాచలం వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ అవసరం లేకపోవడం సంతోషకరమని తెలిపారు. ముఖ్యంగా గర్భిణి మహిళలకు చర్ల ఆసుపత్రి ఎంతో అనుకూలంగా మారిందని, దీంతో ఆర్థిక భారం మాత్రమే కాకుండా ప్రయాణ ఇబ్బందులు కూడా గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు.

# పెట్రోల్ బంక్ యజమానులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా** :జిల్లాలో తలేత్తున్నటువంటి పెట్రోల్, డిజిల్ లబ్యత గురరించి కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ పెర్రోల్ బంక్ యజమానులతో ఎల్ పి జి డిస్ట్రిబ్యుటర్స్ తో సమీక్షా సమవేషము నిర్వహించి నారు, కలెక్టర్ సదరు పెట్రోల్ బంక్ యజమానులతో ప్రజలు పడుతున్నటువంటి అవస్థలను తెలియ చేసారు, పెట్రోల్ బంక్ లు నిర్వాహకులు ప్రజలకు అన్ని వేళల అందుబాటులతో ఉండి డిజిల్, పెట్రోల్ ఎల్ పి జి అందివ్వాలని తెలియ చేస్తారు. చమురు కంపెనీ ల నుండి ఉత్పత్తులు సకాలములో ఇండెంట్ లు పెట్టి ముందోస్తూగా పెట్రోల్ డిజిల్ బంక్ లలో సమృద్ధిగా ఉంచుకోవాలని సూచించారు. చమురు కంపెనీ లకు సంబందించిన బి పీ సీ ఎల్, ఐ ఓసీల్ సేల్స్ ఆఫీసర్ లు ఈ సమావేశానికి హాజరుకాగ హెచ్ పీ సీ ఎల్ సేల్స్ ఆఫీసర్ సమావేశానికి హాజరు కానందుకు సరియైన వివరములు తెలియలేదని వారురానందు కు కారణాలు అడిగారు. పెట్రోల్ బంక్ నిర్వాహకులు వారు తాము ఇండెంట్ లు పెట్టిన కూడా చమురు కంపెనీ లు సకాలములో పెట్రోల్, డిజిల్ పంపిణీ చెయ్యట్లేదు అని తెలియ చేసారు. పెట్రోల్ బంక్ నిర్వాహకులు వారు పెట్టిన ఇండెంట్ లను నిర్వాహకులకు తెలియ కుండానే ఇండెంట్ లను రద్దు చరేసి మరల కొత్తవి పెట్టమంటున్నారని దీని వల్ల వారికి పెట్రోల్ ఉత్పత్తులు సకాలములో అందట్లేదు అని తెలియ చేసారు. కలెక్టర్ ఈ వివరములు అన్ని తెలుసుకుని ప్రజలందరికి పెట్రోల్ ఉత్పత్తులు నిత్యవసరాలకు, వ్యవసాయ అవసరాల కు, పరిశ్రమల అవసరాలకు ఆటంకము లేకుండా అందచేయాలనీ ఈ ఉత్పత్తులు బ్లాకు మార్కెటింగ్ కాని, అక్రమముగా అధిక రేట్ లకు అమ్మడము కాని చేయరాదని హెచ్చరించారు, ఎవరైనా ప్రజలకు ఇబ్బంది కలిగించే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసిన చో చట్ట ప్రకారము గ కట్టిన చర్యలు తీసుకుంటామని డీలర్లకు డిస్ట్రిబ్యుటర్స్ ని హెచ్చరించారు.ఈ కార్యక్రమము లో అంకిత్, కలెక్టర్ ఒ జిల్లా మేజిస్ట్రేట్, డి. వేణుగోపాల్, అదనపు కలెక్టర్, ఎ.ప్రేం కుమరోర్, జిల్లా పౌర సరఫరాల అధికారి పాల్గొన్నారు.

# మేరీ మాత విగ్రహన్ని ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు.



చింతకాని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన మత పెద్దలు.

**చింతకాని పెన్ సత్తా :ప్రతినిధి.** చింతకాని:-చింతకాని మండల కేంద్రంలోని చింతకాని నుండి కొణిజర్ల ప్రధాన రహదారిలో గల మామిడి తోటలో ఉన్న మేరీ మాత విగ్రహం గత ఇరవై ఏళ్లుగా మండలం లోని క్రైస్తవులు పూజలు నిర్వహిస్తున్న మేరీ మాత విగ్రహాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో విషయం తెలుసుకున్న క్రైస్తవ మత పెద్దలు ధ్వంసం అయిన మేరీ మాత విగ్రహాన్ని పరిశీలించి గురువారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.ఇట్టి ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చింతకాని సబ్ ఇన్స్పెక్టర్ వీరేందర్ మాత పెద్దలకు తెలిపారు.పిర్యాదు చేసిన వెంటనే తన సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టిన పోలీసులు.పిర్యాదు చేసిన సమయంలో ఫాదర్ శారి,నారపోగు రామకృష్ణ,సూత్రపు రాంబాబు,మాతంగి ప్రసాద్,పెద్దిపాక రాకేష్,ఉసికల మహేష్,మంచాల జయరాజు,ఉసికల ప్రభాకర్ మరియు తదితరులు మత పెద్దలు పాల్గొన్నారు

# మత్కేపల్లి గ్రామంలో పౌర హక్కుల పై అవగాహన సదస్సు



**చింతకాని పెన్ సత్తా : ప్రతినిధి.** షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల పై అవగాహన సదస్సు చింతకాని మండలంలోని మత్కేపల్లి గ్రామంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కె ద్రౌపతి అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మా గ్రామాల్లో పౌర హక్కుల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి పౌర హక్కుల గురించి గ్రామ ప్రజలకు తెలియజేసినందుకు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు

ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సంక్షేమ శాఖ నుండి వసతి గృహ సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రతి ఒక్కరూ సమానమేనని అనుకోవాలని ప్రజల మధ్య భేదాభిప్రాయాలు ఉండకూడదని మీ గ్రామంలో ఏమైనా పేదభిప్రాయాలు గాని కుల దూషణలు గాని ఉన్నట్లయితే అధికారులకు తెలియజేయాలని కోరినారు అదేవిధంగా సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పథకాల గురించి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె ద్రౌపతి ఆర్ ఐ ఏకవీర, శివరామకృష్ణ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ రావు జిపిఓ మహేందర్ హెల్త్ డిపార్ట్మెంట్ నుంచి ఆశా లు గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారుద

# నూతన వదువరులను ఆశీర్వదించిన కిలారు జగన్ మోహన్ రావు, సరోజినీ దంపతులు



**చింతకానిపెన్ సత్తా : ప్రతినిధి.**చింతకాని గ్రామానికి చెందిన ఉసికల వెంకటరావమ్మా, వెంకటేశ్వర్లు కుమార్తె అయిన సంధ్య, మరియు కరుణాకర్ నూతన దంపతులను ఆశీర్వాందించిన మాజీ సాగునిటీ సంఘం అధ్యక్షులు కిలారు జగన్ మోహన్ రావు మాజీ సర్పంచ్ కిలారు సరోజినీ.

అనంతరం దంపతులకు చిరు కానుక అందించడం జరిగింది

ఈ కార్యక్రమంలో నారపోగు రామకృష్ణ, మాతంగి లూకాస్ ఉసికల వెంకయ్య,చిన్నబాబు మరియు కుల పెద్దలు పాల్గొనడం జరిగింది.

# పెబ్బేరులో శ్రీ రాధాకృష్ణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లు ప్రారంభం ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి జిల్లా పెన్ సత్తా** :వనపర్తి, పెబ్బేరు వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం కంచిరావుపల్లి శివారులో నూతనంగా నిర్మించిన శ్రీ రాధాకృష్ణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వరి పంటకు పేరుగాంచిన పెబ్బేరు ప్రాంతంలో రైస్ మిల్లు ఏర్పాటు వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు టి.సాయి చరణ్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మిల్లు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 100 మందికి ఉపాధి లభిస్తుందని నిర్వాహకులు వెల్లడించారు. యాజమాన్యం అతిథులను ఘనంగా సత్కరించింది.

పెబ్బేరులో రైస్ మిల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు: కంచిరావుపల్లి శివారులో నూతన శ్రీ రాధాకృష్ణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును బుధవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. రైతులకు గిట్టుబాటు ధర, యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు. 100 మందికి ఉపాధి కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# విశ్వవాణి చర్చిలో వి బి ఎస్.




**చింతకాని పెన్ సత్తా : ప్రతినిధి.**చింతకాని మండల కేంద్రంలో గల విశ్వవాణి ప్రార్థన మందిరంలో వేసవి సెలవుల సందర్భంగా చిన్నపిల్లల కోసం వెకేషన్ బైబిల్ స్కూల్ (వీబీస్ ) తరగతులు నిర్వహించారు. గ్రామంలోని చిన్నపిల్లలందరికీ చక్కటి నాటికలు, పాటలు, కథల ద్వారా ఆధ్యాత్మిక జీవితం గడపడానికి ప్రేమ, నీతిని, మంచి నడవడిక, పిల్లలకు బోధించారు. అనంతరం పిల్లలకి బహుమతులు, రుచికరమైన భోజనం అందించారు,

ఈ కార్యక్రమంలో సంఘ కాపరి రెవ. పి. విజయకుమార్, సండే స్కూల్ టీచర్లు, మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు..

# శ్రీ గ్లోబల్ హైస్కూల్ విద్యార్థుల ఘన విజయం.

**చింతకాని/బోనకల్ మండలాల్లో ప్రైవేట్ పాఠశాలల విభాగంలో తొలి మూడు స్థానాలు కైవసం**

**చింతకాని మండలంలో ద్వితీయ స్థానం కైవసం....**

**చింతకాని పెన్ సత్తా : ప్రతినిధి.**చింతకాని, ఏప్రిల్ 30: నిన్న విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నాగులవంచలోని శ్రీ గ్లోబల్ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు ఘనత తీసుకువచ్చారు. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో చింతకాని మరియు బోనకల్ మండలాల్లో తొలి మూడు స్థానాలను కైవసం చేసుకుని విశేష విజయాన్ని నమోదు చేశారు. అదేవిధంగా చింతకాని మండల స్థాయిలో రెండో స్థానాన్ని సాధించి పాఠశాల ప్రతిష్టను మరింత పెంచారు.

పాఠశాలకు చెందిన బి. అభిషేక్ 576/600 మార్కులతో అద్భుత ఫలితం సాధించగా, డి. సాయి కృష్ణ 568/600, వి. పవన్ కుమార్ 567/600, టి. శ్రీవిద్య 561/600, కే.వర్షిత 556/600, ఎన్ లోహిత సన. 554/600 మార్కులతో మెరిసి టాప్ ర్యాంకుల్లో నిలిచారు. 33 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 100% రిజల్ట్ ను సాధించారు. 33 మంది విద్యార్థులలో 26 మంది 500 పైగా మార్కులు సాధించగా, నలుగురు 450 పైగా మార్కులు సాధించగా ముగ్గురు 430 మార్కులు పైగా సాధించడం జరిగింది. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల సమర్థ బోధన, తల్లిదండ్రుల సహకారం ఈ విజయానికి కారణమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

ఈ సందర్భంగా పాఠశాల మేనేజ్మెంట్ సభ్యులు ఇనుకుల దివాకర్ రెడ్డి, వాహిని, తిరుపతి రెడ్డి, సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ రామారావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పాఠశాల విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, నాణ్యమైన బోధనకు ఈ ఫలితాలు నిదర్శనమని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీ గ్లోబల్ హైస్కూల్ మరోసారి ఉత్తమ ఫలితాలతో ప్రాంతంలో తన ప్రత్యేకతను చాటుకుంది.




# వనపర్తి డీఎస్పీకి ఘన వీడ్కోలు

**వనపర్తి జిల్లా పెన్ సత్తా** :వనపర్తి సాధారణ బదిలీల్లో భాగంగా హైదరాబాద్‌కు బదిలీ అయిన వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావుకు గురువారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ శ్రీనివాస ఫంక్షన్ హాలులో ఘనంగా వీడ్కోలు పలికారు. ఏఆర్ అదనపు ఎస్పీ వీరా రెడ్డి శాలువా, పూలమాలతో సన్మానించారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల్లో సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ సమర్థంగా విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. కష్టకాలంలో సిబ్బందికి అండగా నిలిచారన్నారు.

డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ. 26 నెలల సర్వీసులో సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. సర్పంచ్, మున్సిపాలిటీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో పోలీసుల పనితీరు అద్వితీయమని, ప్రజల సహకారం మరువలేనిదని తెలిపారు.

కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్, సీఐలు



రత్నం, రాంబాబు, శివకుమార్, ఆర్ఐ శ్రీనివాస్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొంపల్లి శేషు అనుమానాస్పద మృతి


**నలుగురు కలిసిచంపి ఉరి పెట్టారని భార్య ఆరోపణ**



**చింతకాని ప్రతినిధి పెన్ సత్తా** :.నాగులవంచ రైల్వే కాలనీ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంపెల్లి శేషు అనుమానస్పదగా ఉరి వేసుకొని మృతి చెందాడు. నలుగురు వ్యక్తులు కావాలని చంపి ఉరి వేశారని భార్య అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని చింతకాని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు. సంఘటన స్థలాన్ని పరిశీలించి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

దోషులు ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలని వారు పేర్కొన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై చింతకాని ఎస్ఐ కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మంచాల మండలం టాపర్‌గా నిలిచిన టి పి ఎస్ విద్యార్థి శివసాయి..





**రంగారెడ్డి జిల్లా, మంచాల, పెన్ సత్తా** :మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) పదవ తరగతి ఫలితాల్లో మంచి ప్రతిభ కనబర్చింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ గిరిధర్ మాట్లాడుతూ.. మొత్తం 91.60 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ ఫలితాల్లో ఇంద్రోజు శివ సాయి 551 మార్కులతో మండల టాపర్‌గా నిలిచి పాఠశాలకు గర్వకారణమయ్యాడు. అతని కృషి, పట్టుదల ఫలితంగా ఈ విజయాన్ని సాధించాడని తెలిపారు. అలాగే కే వైష్ణవి 526 మార్కులతో రెండో స్థానంలో, లక్ష్మీ ఐశ్వర్య 503 మార్కులతో మూడో స్థానంలో నిలిచారు. పాఠశాలలో మొత్తం 154 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందులో 141 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణులలో 64 మంది బాలికలు, 77 మంది బాలురు ఉన్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ ఫలితాలు పాఠశాల విద్యా ప్రమాణాలను మరింత ఎత్తుకు తీసుకెళ్లాయని, భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాలు సాధిస్తామని పాఠశాల యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది.

# పోలీసు అధికారుల సేవలు వెలకట్టలేనివి: సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్





**శేరిలింగంపల్లి. పెన్ సత్తా** ::సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో 30.04.2026 నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఏడు మంది పోలీసు సిబ్బందిని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ, రిటైర్ అయిన సిబ్బందికి పెన్షన్ పత్రాలు అందజేసి, పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

ఈ సందర్భం గా సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ,, యూనిఫాం పోలీస్‌కు రెండో చర్మంలాంటిదని, ప్రజల కన్నీరు తుడిచి, వారికి సేవలు అందించిన ప్రతి పోలీసు అధికారి పదవీ విరమణ సమయంలో గర్వపడాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి తన కుటుంబానికి రుణపడి ఉండాలన్నారు. పోలీసులు విధుల నిర్వహించే క్రమం లో వారి కుటుంబ సభ్యులు ఎన్నో త్యాగాలు చేస్తారని గుర్తు చేశారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, సమాజంలోని పౌరులతో సానుభూతితో, గౌరవంతో మెలగాలని సూచించారు. పదవీ విరమణ చేసిన పోలీసులు తమ అనుభవంతో పోలీస్ శాఖకు అవసరమైనప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ బీ ఏడీసీపీ రవికుమార్ డిసీపీగా ప్రమోషన్ పొందినందుకు సీపీ అభినందనలు తెలిపారు.




తన పదవీ విరమణ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ. . ప్రజలకు చేరువయ్యేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఒక కానిస్టేబుల్ కుమారుడిగా కెరీర్‌ను ప్రారంభించి, నేడు డీసీపీ స్థాయికి ఎదగడం పట్ల గర్వంగా ఉందన్నారు. పోలీస్ శాఖలో శారీరక శ్రమతో పాటు 'హ్యూమన్ ఇంటెలిజెన్స్' మరియు మేధోపరమైన కృషి ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు. తన విజయ ప్రస్థానంలో కుటుంబ సభ్యుల తోడ్పాటు మరవలేనిదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.

సైబరాబాద్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో ట్రాఫిక్ 2 డీసీపీ రంజన్ రతన్ కుమార్, ఎస్‌బీ ఎస్ఐ పి. వెంకట్ రెడ్డి, ఏఆర్ఎస్ఐ కె. మురళీధర్ సంగారెడ్డి జిల్లా అటాచ్‌మెంట్‌తో సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో, ఏఆర్ఎస్ఐ ఎన్. కృష్ణ సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో, ఏఎస్ఐ వి. వెంకట సూర్యనారాయణ రాజు ఈఓడబ్ల్యూ సైబరాబాద్‌లో, డి. రాములు మోకిల పోలీస్ స్టేషన్‌లో, అలాగే జి. అశోక్, బార్బర్, సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తూ తమ పదవీ విరమణ పొందారు. వీరి సేవలను అధికారులు అభినందిస్తూ, భవిష్యత్తులో ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమం లో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, ఎస్‌బి ఏడీసీపీ రవికుమార్, మరియు వివిధ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# పెబ్బేరులో శ్రీ రాధాకృష్ణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లు ప్రారంభం ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి జిల్లా పెన్ సత్తా** : వనపర్తి, పెబ్బేరు వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం కంచిరావుపల్లి శివారులో నూతనంగా నిర్మించిన శ్రీ రాధాకృష్ణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వరి పంటకు పేరుగాంచిన పెబ్బేరు ప్రాంతంలో రైస్ మిల్లు ఏర్పాటు వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు టి.సాయి చరణ్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మిల్లు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 100 మందికి ఉపాధి లభిస్తుందని నిర్వాహకులు వెల్లడించారు. యాజమాన్యం అతిథులను ఘనంగా సత్కరించింది.

పెబ్బేరులో రైస్ మిల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు: కంచిరావుపల్లి శివారులో నూతన శ్రీ రాధాకృష్ణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును బుధవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. రైతులకు గిట్టుబాటు ధర, యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు. 100 మందికి ఉపాధి కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# హైదరాబాద్‌లో భట్రాజు సంఘం ఎన్నిక పై వివాదం : రద్దు చేయాలని డిమాండ్

- **కోరం లేకుండా ఎన్నికలు? భట్రాజు సంఘంలో ఉద్రిక్తతలు తీవ్రం**
- **బాహ్య వ్యక్తి అధ్యక్షుడిగా ఎంపిక ఎన్నికలపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు**
- **సభ్యులకు సమాచారం లేకుండా ఎన్నికలు నిర్వహణ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు**
- **పారదర్శకత లేకపోవడంతో ఎన్నికలు రద్దు చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది**



**హైదరాబాద్, పెన్ సత్తా** :తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం హైదరాబాద్ జిల్లా-1 శాఖలో ఇటీవల నిర్వహించిన ఎన్నిక వివాదాస్పదంగా మారింది. మార్చి 22, 2026న జరిగిన ఈ ఎన్నికలను రద్దు చేయాలని ఓంకారం కీర్తి సంతోష్ రాజ్ రిజిస్ట్రార్ మరియు హామీల కార్యాలయానికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

సంఘ ప్రతినిధుల ప్రకారం, ఈ ఎన్నికలు సరైన కోరం లేకుండా నిర్వహించబడినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 120 కుటుంబాలు ఉన్నప్పటికీ, కేవలం 28 మంది సభ్యులతోనే ఎన్నికలు జరపడం పై తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతోంది. పలువురు సభ్యులు ఎన్నికల ప్రక్రియ గురించి ముందస్తు సమాచారం ఇవ్వలేదని ఫిర్యాదు చేయడం గమనార్హం.

ఇక అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రాంతం వాసి కావడం హైదరాబాద్ జిల్లా-1కు చెందినవారు కాకుండా మెడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందినవారని కమిటీ పేర్కొంది.

అదనంగా సంఘ ఉపనిబంధనలను ఉల్లంఘిస్తూ సరైన సభ్యత్వ నమోదు లేకుండానే ఎన్నికలు నిర్వహించారని, తమ జిల్లాల్లో నివసించని వ్యక్తులను బాధ్యతలలో నియమించారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో, మార్చి 22న జరిగిన ఎన్నికల ఫలితాలను తక్షణమే రద్దు చేసి, అర్హులైన సభ్యులందరిని నమోదు చేసుకునేందుకు గడువు ఇవ్వాలని కమిటీ కోరింది. అలాగే, అధికారిక పర్యవేక్షణలో పారదర్శకంగా తిరిగి ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. ఈ అంశంపై విచారణ జరిపి, కొత్త ఎన్నికల తేదీని ప్రకటించాలని జిల్లా రిజిస్ట్రార్‌ను కమిటీ కోరింది.

# మియాపూర్‌లో సీరియల్ హౌస్ దొంగ నిందితుడు అరెస్ట్ -- రూ.1.5 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం



**శేరిలింగంపల్లి, పెన్ సత్తా** : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కూకట్‌పల్లి జోన్ మియాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది చురుకైన చర్యలతో అలవాటు గల ఇళ్ల దొంగతన నేరస్థుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నిర్దిష్ట సమాచారం ఆధారంగా ఈ రోజు (30.04.2026) మియాపూర్ పోలీసులు నిందితుడు కల్లూరి లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టైన నిందితుడు కల్లూరి లక్ష్మణ్ (39), తండ్రి సాయిలు, వృత్తి ఎలక్ట్రిషియన్. ఇతడు ఐడీఏ జీడిమెట్లలోని రామ్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉంటూ, స్వస్థలం నిజామాబాద్ జిల్లా నవీపేట్‌గా గుర్తించారు. పోలీసుల విచారణలో నిందితుడు తన పని ప్రదేశాల్లోనే విద్యుత్ సంబంధిత వస్తువులను దొంగిలించి పారిపోయేవాడని అంగీకరించాడు. అతని వద్ద నుంచి రూ.1,50,000/- విలువైన దొంగిలించిన వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఏ బి బి కంపెనీకి చెందిన ఎం సి సి బి లు 6, లారిట్జ్ క్నుడ్సెన్ కంపెనీకి చెందిన క్యాపాసిటర్ బ్యాంకులు 8, అలాగే టీవీఎస్ జూపిటర్ మోటార్ సైకిల్ ( టి జి 08 ఎల్ 2217) ఉన్నాయి.

ఈ కేసుకు సంబంధించి మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 531/2026గా, 305(ఏ) బి ఎన్ ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన మియాపూర్ పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

– అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్

# బుద్ధ పౌర్ణమి 2026: ఈ 5 వస్తువులు ఇంట్లోకి తెచ్చుకుంటే డబ్బు, సంతోషం, అదృష్టం మీ సొంతం!




హిందూ క్యాలెండర్ ప్రకారం వైశాఖ మాసంలో వచ్చే పౌర్ణమికి చాలా ప్రత్యేకత ఉంది. ఈ ఏడాది మే 1వ తేదీన వైశాఖ పౌర్ణమి వస్తోంది. ఇదే రోజును మనం 'బుద్ధ పౌర్ణమి'గా జరుపుకుంటాం. ఎందుకంటే, గౌతమ బుద్ధుడు జన్మించినది, ఆయనకు జ్ఞానోదయం కలిగినది ఇంకా ఆయన పరమపదించినది కూడా ఇదే రోజున అని నమ్ముతారు. ఈ పవిత్రమైన రోజున కొన్ని వస్తువులను ఇంటికి తెచ్చుకోవడం వల్ల సుఖసంతోషాలు, సంపద కలుగుతాయని పెద్దలు చెబుతుంటారు.... అయితే అవేంటో చూద్దాం:

**1. బుద్ధుని విగ్రహం**

శాంతికి మారుపేరు బుద్ధుడు. ఇంట్లో బుద్ధుని విగ్రహం ఉంటే మనశ్శాంతి లభిస్తుందని వాస్తు నిపుణులు చెబుతారు. బుద్ధ పౌర్ణమి రోజున ధ్యాన ముద్రలో ఉన్న బుద్ధుని విగ్రహాన్ని లేదా లాఫింగ్ బుద్ధాను తెచ్చుకుని ఇంట్లో కొంచెం ఎత్తైన ప్రదేశంలో ఉంచండి. దీనివల్ల ఇంట్లోని ఒత్తిడి తగ్గి, ప్రశాంతత నెలకొంటుంది.

**2. ఇత్తడి ఏనుగు**

వాస్తు శాస్త్రం ప్రకారం ఏనుగు స్థిరత్వానికి, ఐశ్వర్యానికి సంకేతం. బుద్ధ పౌర్ణమి రోజున ఇత్తడితో చేసిన ఏనుగు బొమ్మను కొని, ఇంటి ముఖ ద్వారం లోపలి వైపు చూస్తున్నట్లుగా పెడితే ఇంట్లోకి సానుకూల శక్తి వస్తుంది. కుటుంబ సభ్యుల మధ్య గొడవలు తగ్గి సఖ్యత పెరుగుతుంది.

**3. గవ్వలు**

గవ్వలు అంటే లక్ష్మీదేవికి చాలా ఇష్టం. పాల సముద్రాన్ని చిలికినప్పుడు పుట్టిన వస్తువుల్లో గవ్వలు కూడా ఉన్నాయి. అందుకే సంపద పెరగాలంటే గవ్వలు ఇంట్లో ఉండాలని అంటారు. ఈ రోజు కొన్ని గవ్వలను తెచ్చుకుని, వాటికి పూజ చేసి, ఎర్రటి బట్టలో కట్టి మీ బీరువాలో లేదా డబ్బులు పెట్టే చోట ఉంచితే ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయి.

**4. వెండి నాణెం**

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం వెండికి, చంద్రుడికి దగ్గరి సంబంధం ఉంది. చంద్రుడు మనస్సుకు కారకుడు. పౌర్ణమి రోజున వెండి నాణెం కొని మీ పూజ గదిలో ఉంచడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. అలాగే దీనివల్ల ఆర్థిక పరిస్థితి మెరుగుపడి, అదృష్టం కలిసి వస్తుందని నమ్ముతారు.

**5. శ్రీ యంత్రం**

శ్రీ యంత్రం సాక్షాత్తూ లక్ష్మీదేవి స్వరూపం. బుద్ధ పౌర్ణమి నాడు శ్రీ యంత్రాన్ని ఇంటికి తెచ్చుకుని నిష్టతో పూజిస్తే సంపదకు కొదవ ఉండదు. వ్యాపారంలో అభివృద్ధి చెందాలన్నా, ఇంట్లో దరిద్రం పోవాలన్నా ఈ యంత్రాన్ని పూజా గదిలో ఉంచి రోజూ ప్రార్థించడం మంచిది.

# జ్యోతిష్యం : మే నెల పౌర్ణమితో మొదలు.. పౌర్ణమితో ముగింపు.. మే నెలలో వచ్చే పండుగలు ఇవే






మే నెల.. ఇంగ్లీషు సంవత్సరాల్లో ఇది ఐదవ నెల .. సూర్య భగవానుడు భగ భగ మండిపోతాడు. గాలి దుమ్ములు వచ్చే కాలం మే నెల. ఈ ఏడాది మేనెల ఆధ్యాత్మికంగా చాలా విశిష్టత ఉందని పండితులు చెబుతున్నారు. మే నెల పౌర్ణమి తిథితో ప్రారంభం కాగా మరల అదే తిథితో ముగుస్తుంది. ఇంకా ఈ ఏడాది మే నెల విశిష్టత గురించి తెలుసుకుందాం.

పురాణాల ప్రకారం వైశాఖ పౌర్ణమి చాలా విశిష్టమైనది. తెలుగు పంచాంగం ప్రకారం వైశాఖ మాసం పౌర్ణమితో ప్రారంభమైన మే మంత్ జ్యేష్ట మాసం పౌర్ణమి తిథితో ముగుస్తుంది. అంటే 2026 మే నెల స్టాటింగ్? డే.. మరియు ఎండింగ్ డే..ఈ రెండు రోజుల్లో చంద్రుడు వెన్నెల కురిపించనున్నాడుజ్యోతిష్యశాస్త్రం ప్రకారం 2026 మే నెలలోనే సూర్యుడు మేషరాశి నుంచి వృషభరాశిలోకిప్రవేశిస్తాడు. దీనినూ వృషభ సంక్రమణం అంటారు. పురాణాల ప్రకారం వైశాఖ పౌర్ణమి రోజు దాన ధర్మాలు.. , జ్యేష్టమాసంలో జలదానాలు అత్యంత పుణ్యఫలాన్ని ఇస్తాయి. ఇంకా ఇదే నెలలో బుద్ధ జయంతి, హనుమాన్? జయంతి, శని భగవానుడి పుట్టిన రోజు వంటి పర్వదినాలు కూడా ఉన్నాయి. ఈ నెలలో అనేక శుభ ముహూర్తాలు ఉన్నాయి.

**2026 మే నెల పండుగల వివరాలు**

**మే 1 (వైశాఖ పూర్ణిమ):** దీనినే బుద్ధ పూర్ణిమ అని కూడా పిలుస్తారు. వైశాఖ పూర్ణిమ రోజున శ్రీమహావిష్ణువు కూర్మావతారంలో అవతరించినట్టుగా చెబుతారు. అందుకే వైశాఖ పూర్ణిమ రోజును కూర్మజయంతిగా కూడా జరుపుకుంటారు. అంతేకాదు, మే 1 పూర్ణమి తిథి కావడంతో ఆరోజున సత్యనారాయణ స్వామి వ్రతాలను చేసుకుంటారు.

**మే 12 (హనుమత్ జయంతి):** హనుమంతుడికి కేటాయించిన రోజు. మే 12 వ తేదీ హనుమాన్ జయంతి కూడా రావడంతో తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఉత్సవాలను నిర్వహిస్తారు. వైశాఖ బహుళ దశమి రోజున హనుమాన్ జయంతిని జరుపుకోబోతున్నాం. అంతేకాదు, హనుమంతుడికి అత్యంత ఇష్టమైన మంగళవారం కూడా అదే రోజు కావడం ఈ పండుగకు మరింత ప్రాశస్త్యం ఏర్పడింది. మే 16 ( శనిజయంతి): శని భగవానుడు జన్మించిన రోజు కావడంతో ఏలినాటి శని ప్రభావం ఉన్నవారు ఆరోజున స్వామివారికి తైలాభిషేకం చేస్తారు. ఇలా శని జయంతి రోజున తైలాభిషేకం చేయడం వలన ప్రభావం 50 శాతం వరకు తగ్గుతుందని పండితులు చెబుతున్నారు.

మే 16( వట సావిత్రి వ్రతం): మహిళలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహిస్తారు. వట వృక్షాన్ని పూజించి ఈ వ్రతం చేయడం వలన సౌభాగ్యం సిద్ధిస్తుందని నమ్మకం.

మే 25( గంగా దసరా పండుగ) : పవిత్రమైన గంగానది భూమికి దిగివచ్చిన రోజు గంగా దసరా. ఆధ్యాత్మిక శుద్ధి, దానధర్మాలు, ఆశీర్వాదాలను కొనుకోవడానికి ఈరోజు అత్యంత పవిత్రమైనదిగా చెబుతారు.


**మే 26 : యమునా నది పుష్కరాలు ప్రారంభం**

**మే 28( నిర్జల ఏకాదశి) :** ఏడాదిలో వచ్చే 24 ఏకాదశుల్లో ఈ నిర్జల ఏకాదశి అత్యంత కఠినమైనదిగా చెబుతారు. ఈ నిర్జల ఏకాదశి రోజున చుక్కనీరు కూడా ముట్టుకోకుండా ఉపవాసం చేయాలి. ఇలా చేయడం వలన సకల పాపాలు తొలగిపోతాయిని చెబుతారు.

**మే 31(ఏరువాక పౌర్ణమి):** ఈరోజున రైతులు నాగలిపట్టి పొలాన్ని దున్నే శుభ సమయం. ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగల్లో ఏరువాక పౌర్ణమి ఒకటి. పొలం దున్నిన రోజు నుంచి రైతుల పొలం పనులు ప్రారంభమౌతాయి. అంటే వైశాఖ పౌర్ణమి తిథితో ప్రారంభమైన 2026 మే నెల జ్యేష్ట పౌర్ణమితో ముగుస్తుంది.

మొత్తంగా చెప్పాలంటే మే నెలలో ప్రతి ఒక్కరూ కనీసం ఐదు రోజులు ఉపవాసం, జపం, దానం చేయడం ద్వారా జీవితంలో శాంతిని, సుఖాన్ని పొందవచ్చు. ఈ మే నెలలో భక్తితో చేసిన ప్రతి పని మహాపుణ్య ఫలాన్ని ఇస్తుంది. ఆధ్యాత్మికతను ఆచరిస్తే జీవితం సార్థకమౌతుందని పండితులు చెబుతున్నారు.

# బుద్ధ పూర్ణిమ 2026 : ప్రపంచానికి జ్ఞనాన్ని అందించిన గౌతముడు పుట్టిన రోజు ఇదే..!




బుద్ధ పూర్ణిమ.. వైశాఖ పౌర్ణమి.. ఈ పర్వదినానికి మనదేశంలో ఎంతో విశిష్టత ఉంది. హిందూ క్యాలెండర్ ప్రకారం ఈ ఏడాది మే1 న అంటే శుక్రవారం రోజున బుద్ధ జరుపుకోనున్నాం. ఈ రోజు బౌద్ధులకు కూడా ఎంతో ప్రత్యేకమైన రోజు. మరి ఈ రోజు బౌద్ధులకు ఎందుకు అంత ప్రత్యేకమైన రోజో ఇప్పుడు తెలుసుకుందాం.

బౌద్ధ మతం స్థాపకుడైన బుద్ధుడు అసలు పేరు సిద్ధార్థ గౌతముడు. అతను వైశాఖ మాసంలో పూర్ణిమ తిథి (పౌర్ణమి రాత్రి) లో లుంబినిలో కులీన శాక్య వంశానికి చెందిన సుద్ధోదన మహరాజు, రాణి మాయదేవికి జన్మించాడు. యాదృచ్ఛికంగా చాలా రోజుల తరువాత సిద్ధార్థుడికి జ్ఞానోదయం పొందాడు. బోధగయలో రావిచెట్టు కింద ధ్యానం చేస్తూ జ్ఞానోదంయ పొందాడు.

గౌతమ బుద్ధుడు బోధ గయలో జ్ఞానోదయం అనంతరం తన మొదటి బోధన సారనాథ్ లో ఇచ్చాడనే సంగతి అందరికి తెలిసిందే. బోధగయ నుంచి 5 వారాల పాటు సారనాథ్ కు ప్రయాణం సాగించి అక్కడ తన మొదటి ప్రసంగాన్ని ఇచ్చాడు. మొదటి బోధనను గురుపూర్ణిమ రోజే బుద్ధుడు తన శిష్యులకు బోధించాడు.

బుద్ధుని జీవితంలో వైశాఖ పూర్ణిమ మూడుసార్లు అత్యంత ప్రాముఖ్యతను వహించింది. కపిలవస్తు రాజు శుద్ధోధనుడు, మహామాయలకు ఓ వైశాఖ పౌర్ణమి నాడు సిద్ధార్థుడిగా జన్మించాడు. మరో వైశాఖ పూర్ణిమనాడు జ్ఞానోదయం పొంది సిద్ధార్థుడు బుద్ధుడిగా మారాడు. వేరొక వైశాఖ పూర్ణిమనాడు నిర్యాణం చెందాడు. తల్లి చనిపోవడంతో గౌతమి అనే మహిళ సిద్ధార్థుని పెంచిందని... అందుకే గౌతముడనే పేరు వచ్చిందని చరిత్రకారులు చెబుతారు. భాగవత పురాణంలో వివరించబడిన వివరాల ప్రకారం ఉత్తర హిమాలయ పుణ్య శ్రేణులలో ఉన్న శంబళ కేంద్రం నుంచి ప్రేరణ వస్తుంది. దశవతారమైన కల్కి శంబళ గ్రామం నుంచి అవతరించాడు.

మధ్య హిమాలయ శ్రేణులలో ఉన్న కలాప గుహలలో ఉన్న పరమగురు పరంపర ముఖ్య కేంద్రంలో ఈ ప్రేరణను అందుకుంటారని పురాణాల ద్వారా తెలుస్తుంది.

వైశాఖ పూర్ణిమ... దీనిని మహా వైశాఖి.. బుద్ధ పూర్ణమి అనే పేరుతో పిలుస్తారు. గౌతమ బుద్ధుడు భూమండల ప్రభువైన సనత్కుమారులు, పరమ గురువుల పరంపర మధ్య వారధిగా ఉంటాడని, అందువల్లే వైశాఖ పూర్ణిమ.. బుద్ధ పూర్ణిమగా ప్రసిద్ధి చెందింది.

బుద్ధుని ఉపదేశంలో గొప్ప సత్యాలున్నాయి. అవి.. లోకం దుఃఖమయం, దుఃఖానికి మూలం కోరిక, కోరికను నివారించడం ద్వారా దుఃఖాన్ని నివారించవచ్చు, అష్టాంగ మార్గాన్ని అనుసరించడం ద్వారా కోరికలను నివారించవచ్చున్నాడు. అష్టాంగ మార్గంలో సరైన దృష్టి, సరైన ఆలోచన, సరైన వాక్కు, సరైన క్రియ, సరైన జీవనం, సరైన సాధన, సరైన స్మృతి, సరైన ధ్యానం వంటి ఎనిమిది శాస్త్రీయ పరిష్కారాలు చూపాడు. వీటిని చక్కగా ఆచరించడం ద్వారా ప్రశాంతత, శాంతి లభిస్తుంది. ఇవీ నేటి సమాజంలో కూడా ఆచరణీయమైనవి. మానవ విలువలు కలిగిన బౌద్ధం.. అశోకుడు వంటి గొప్ప రాజుల ఆదరణకు నోచుకొన్నది. దీంతో సామాన్య జనులకు దగ్గరైంది. బుద్ధుడు సరళమైన తాత్వికత, ఆచరణాత్మక విధానాలు భారతదేశంతోపాటు ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి.

## జ్యోతిష్యం: మీనరాశిలోకి శని, కుజుడు.. చంద్ర సంచారంలో మార్పు.. నాలుగు రాశుల వారికి తిరుగులేని అదృష్టం..



వైశాఖ పౌర్ణమి.. బుద్ధ పౌర్ణమి 2026 మే 1 శుక్రవారం. ఈ రోజు ఆధ్యాత్మికంగా చాలా ప్రత్యేకమైన రోజు. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం ఈ ఏడాది (2026) అలాంటి పవిత్రమైన రోజున మీనరాశిలో శని.. కుజుడు కలయిక వలన బుధాదిత్య యోగం, సిద్ధి యోగాలు ఏర్పడనున్నాయి. ఇంకా అదే రోజు ( 2026 మే 1 శుక్రవారం ) ఉదయం 2.16 గంటలకు రాహువుచంద్రుడు ... రాహువు అధిపతి అయిన స్వాతి నక్షత్రంలోకి ప్రవేశించనున్నాడు. ఈ గ్రహాల సంచారంలో మార్పు వలన నాలుగు రాశుల వారికి అనేక విధాలుగా లాభాలు కలుగనున్నాయి. ఇప్పుడు ఆ అదృష్టరాశుల గురించి తెలుసుకుందాం. .

మిధున రాశి: ఈ రాశి వారికి వైశాఖ పౌర్ణమి వేళ చంద్ర సంచారంలో మార్పు వలన అన్ని విధాలుగా శుభ ఫలితాలుంటాయి. ఉద్యోగస్తులు.. వ్యాపారస్తులు.. చేతి వృత్తుల వారి సక్సెస్‌ను ఎవరూ ఆపలేరు. బిజినెస్‌కు సంబంధించి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటే కూడా బాగా కలిసి వస్తుంది. ఆనందం కూడా రెట్టింపు అవుతుంది.ఆర్థిక లాభాలు కలగనున్నాయి. శుభవార్తలు వింటారు. మనసు ప్రశాంతంగా మారుతుంది. . కుటుంబంతో ఎక్కువ సమయం సంతోషంగా గడుపుతారు. ఈ సమయంలో వ్యాపారాలకు సంబంధించి ఏ నిర్ణయాలు తీసుకున్నా.. మంచి విజయాలు అందుకుంటారు.

కర్కాటకరాశి: చంద్రుడు నక్షత్ర మార్పు ఈ రాశి వారికి సానుకూల ఫలితాలను కలుగుతాయి. ఆగిపోయిన పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగస్తులకు ప్రమోషన్? వచ్చే అవకాశం ఉంది. కోర్టు సంబంధిత విషయాల్లో మంచి పరిష్కారం లభిస్తుంది. కుటుంబ సభ్యుల మధ్య అభిప్రాయ బేధాలు తొలగుతాయి. కొత్త ప్రాజెక్ట్?లు చేపట్టే అవకాశం. వ్యాపారస్తులు గతంలో పెట్టిన పెట్టుబడుల నుంచి లాభాలు పొందుతారు. అన్ని విషయాల్లో అనుకూల ఫలితాలను పొందుతారు. ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిలు అందే అవకాశం ఉందని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు.

సింహరాశి: చంద్రగ్రహం సంచారంలో మార్పు .. మీనరాశిలో కుజుడు.. శని కలయిక వలన ఈ రాశి వారికి ఆత్మవిశ్వాసం పెరిగే అవకాశం ఉంది. తీసుకున్న ప్రతి నిర్ణయంలో కూడా సానుకూల పలితాలుంటాయి. సమాజంలో ఉన్నత వ్యక్తులు పరిచయవుతారు. గౌరవ.. మర్యాదలు పెరుగుతాయి. నిరుద్యోగులకు ఆశించిన జాబ్? వస్తుంది. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. కొత్త ఆదాయ మార్గాలు ఏర్పడే అవకాశం ఉందని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు.

కుంభరాశి: వైశాఖ పౌర్ణమి రోజున చంద్రుడు నక్షత్రం మార్పు వలన ఈ రాశి వారికి అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుంది. వ్యాపారస్తులు ఊహించని లాభాలు కలుగుతాయి. విదేశీ ప్రయాణాలు కలిసి వస్తాయి, మానసిక ప్రశాంతత కలుగుతుంది.పాత బకాయిలు వసూలు వసూలవుతాయి. పూర్వీకుల ఆస్తి కలిసి వచ్చే అవకాశం ఉంది. ఈ రాశి వారు ఆర్థిక లాభాలు పొందే అవకాశం ఉందని పండితులు చెబుతున్నారు.

## బీపీ ఉన్నవారు రక్తదానం చేయొచ్చా.. బ్లడ్ ఇస్తే లాభమా..నష్టమా.. ఏమవుతుంది.



రక్తదానం ప్రతి ఒక్కరు చేయగల పనిగానే కనిపించినా దీన్ని చేసేటప్పుడు కొన్ని ఆరోగ్య ప్రమాణాలను పాటించడం తప్పనిసరి . బీపీ అధికంగా ఉన్నవారు కూడా రక్తదానం ఇవ్వకూడదు. పల్స్ రేటు సాధారణంగా ఉన్నవారు మాత్రమే రక్తదానం చేయాలి. అలాగే గుండె జబ్బులు ఉన్నవారు, క్యాన్సర్ వంటి అనారోగ్యాలు ఉన్నవారు రక్తదానానికి దూరంగా ఉండాలి. అలాగే బీపీ.. షుగర్? ఉన్న వారు కూడా రక్తదానం చేయకపోవడమే మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. అధికంగా బీపీ ( బ్లడ్? ప్రెజర్?) ఉన్నవారు రక్తదానం చేస్తే ఎమవుతుందో ఈ స్టోరీలో తెలుసుకుందాం...

రక్తదానం ఎంతో గొప్పది. ఇది మనిషి ప్రాణాన్ని కాపాడుతుంది. అందుకే రక్తదానం మహా దానం అనే పదం వచ్చింది. . రక్తం ఇవ్వాలంటే దాత పూర్తిగా ఆరోగ్యంగా ఉండాలి. దాత బరువు కనీసం 50 కిలోలు ఉండాలి. దయాస్టోలిక్ బీపీ 50 నుంచి 100 మధ్యగా, సిస్టోలిక్ బీపీ 100 నుంచి 180 మధ్యగా ఉండాలి. పల్స్ రేట్ 50 నుంచి 100 మధ్య ఉండాలి. సాధారణంగా బీపీ ఉన్నవారికి బ్లడ్? ప్రెజర్? తరచుగా మారుతుంది. రక్తదానం చేసే సమయంలో బ్లడ్? ప్రెజర్? లో మార్పులు వస్తే దాని ప్రభావం గుండె .. మెదడు పై పడే అవకాశం. ఒక్కోసారి హర్ట్? బరస్ట్? అవుతుంది. ప్రెజర్? ఎక్కువైతే మెదడులో నరాలు తెగిపోయే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అంతే కాదు బీపీ సాధారణ స్థాయి కన్నా తగ్గితే అపస్మరక స్థితిలో ( కోమా)కి వెళ్లే అవకాశం ఉంది. అందుకే నడి వయస్సులో ఉన్న కాని బీపీ వ్యాధితో బాధపడే వారిని.. బీపీ ఉన్న వారిని రక్తదానం చేయవద్దని వైద్యులు చెబుతుంటారు.రక్తదానం ఇచ్చేందుకు వెళ్లిన వెంటనే ముందు బీపీ టెస్ట్? చేస్తారు. అందులో హెచ్చు తగ్గులు ఉన్నా.. గతంలో బీపీ ఉందని అనుమానం వచ్చిన సరే అలాంటి వారి నుంచి రక్తం తీసుకోరు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## కవిత అసలు ప్లాన్ అదేనట.. వర్కఅవుట్ అయితే సక్సెస్ అయినట్లే

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితకు టీఆర్ఎస్ పేరు రావడం ఒకరకంగా శుభమే. తనను సస్పెండ్ చేసిన బీఆర్ఎస్ నాయకత్వానికి కవిత చావు దెబ్బ తీసింది. ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ ను టీఆర్ఎస్ గా మార్చాలని కింది స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి నేతల వరకూ డిమాండ్ పెరుగుతోంది. త్వరలో కేసీఆర్ తోచర్చించి నిర్ణయం తీసుకుంటామని, సెంటిమెంట్ ను మళ్లీ తీసుకు వస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పిన కొద్ది రోజులకే చెల్లెలు కవిత టీఆర్ఎస్ ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇక వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గానే ఎన్నికలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### బీఆర్ఎస్ కు నో ఛాన్స్...

బీఆర్ఎస్ గా పార్టీ పేరు మార్చిన తర్వాతనే ఓటమి ఎదురయిందని భావించిన ఆ పార్టీ నేతలకు కవిత లేవకుండా కొట్టినట్లయింది. కేసీఆర్ చుట్టూ ఉన్న కోటరీ తనను ఆయన వద్దకు వెళ్లకుండా అడ్డుపడుతున్నారని కవిత అనుమానిస్తుంది. మరొకవైపు బీఆర్ఎస్ లో తనకు నెంబరు2 స్థానాన్ని కవిత కోరుకుంటుంది. అయితే కేసీఆర్ తన కుమారుడినే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చేయడంతో పాటు పార్టీ పగ్గాలు అప్పగించడంతో ఇక తాను బీఆర్ఎస్ లో కేవలం ఒక నేతగానే మిగిలిపోతానన్నభావన కవితలో బలంగా మిగిలిపోయింది. అందుకే కవిత తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలని నిర్ణయించుకుని, పార్టీ ముఖ్య నేతలపై విమర్శలు చేసి సస్పెన్షన్ అయ్యేటట్లు వ్యవహరించినట్లు అర్ధమవుతుంది.

### జనసేన తరహాలో తాను కూడా...

ఇక ఏపీలో జనసేన తరహాలో తాను కూడా రానున్న ఎన్నికల్లో కీలకంగా మారాలని కవిత ప్లాన్ చేసినట్లు సమాచారం. నేరుగా అధికారంలోకి రాకపోయినప్పటికీ ఏపీలో జనసేన లాగానే ఎన్నికల అనంతరం పొత్తుకు కవిత ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. అది ఏ పార్టీతో అంటే.. ఖచ్చితంగా బీఆర్ఎస్ తోనేనని చెప్పాలి. కాంగ్రెస్ తో కవిత చేతులు కలపరు. అలాగే తనను ఢిల్లీ మద్యం కేసులో జైలులో వేసిన బీజేపీని కూడా దగ్గరకు రానివ్వదు. మరొకవైపు బీఆర్ఎస్ వ్యతిరేక ఓట్లు తాను చీల్చుకోవచ్చు. కాంగ్రెస్, బీజేపీ వ్యతిరేక ఓట్లు కూడా తనకు పడితే తాను కీలకంగా మారే అవకాశముందని భావించి సొంత పార్టీతోనే అన్ని స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. కానీ ఇవన్నీ ఊహాజనితమే. కానీ ప్రజలు ఏ పార్టీ కైనా స్పష్టమైన మెజారిటీ ఇస్తే కవితను ఎవరూ పట్టించుకోరన్నది కూడా అంతే వాస్తవం.

# పురుషుల్లోనూ రొమ్ము క్యాన్సర్... ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త!

**మహిళల్లో అత్యధికంగా కనిపించే క్యాన్సర్లలో ముఖ్యమైనది బ్రెస్ట్ క్యాన్సర్**

**పురుషుల్లోనూ అరుదుగా కనిపించే రొమ్ము క్యాన్సర్**

**ప్రతి 1000 మంది పురుషుల్లో ఒకరు దీని బారినపడే అవకాశం**

**ముందుగా గుర్తించడమే చాలా ముఖ్యం**

రొమ్ము క్యాన్సర్... ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో చాలామందిని కబళించే క్యాన్సర్లలో ఇది ముఖ్యమైనది. మహిళలే కాదు, పురుషుల్లోనూ కొందరు రొమ్ము క్యాన్సర్ బారినపడుతుంటారు. ప్రతి 1000 మందిలో ఒకరు రొమ్ము క్యాన్సర్ బాధితులు అయ్యే అవకాశం ఉందని గురుగ్రామ్ కు చెందిన ఆన్ క్వెస్ట్ ల్యాబొరేటరీ మాలిక్యులర్ బయాలజీ అధిపతి డాక్టర్ వినయ్ భాటియా వెల్లడించారు.

అయితే మహిళలకు మమ్మోగ్రామ్ వంటి టెస్టుల ద్వారా రొమ్ము క్యాన్సర్ ను ముందే పసిగట్టే అవకాశం ఉండగా, పురుషులకు నిర్దిష్ట ప్రమాణాలతో కూడిన ముందస్తు పరీక్షలు దాదాపుగా లేవనే చెప్పాలి. దాంతో, పురుషులు తమ రొమ్ము కణజాలంలో జరిగే మార్పులను గుర్తించలేక, అవి సాధారణమైన మార్పులే అనుకుని బ్రెస్ట్ క్యాన్సర్ మరింత ముదిరిపోయే ప్రమాదం తెచ్చుకుంటున్నారని డాక్టర్ వినయ్ భాటియా వివరించారు. పురుషుల్లో 60-70 ఏళ్ల వయసున్న వారిలో రొమ్ము క్యాన్సర్ కేసులు అత్యధికం. కుటుంబ గత చరిత్రను పరిశీలిస్తే, ఆ కుటుంబంలోని మహిళలు ఎవరైనా రొమ్ము క్యాన్సర్ కు గురైతే, ఆ కుటుంబంలోని పురుషులు రొమ్ము క్యాన్సర్ బారినపడే అవకాశాలు ఉంటాయి. మహిళలకు మాదిరే రొమ్ము భాగంలో గడ్డలు ఏర్పడతాయి. రొమ్ము బుడిపెల నుంచి రక్తం కారడం, ఇతర స్రావాలు బయటికి రావడం, రొమ్ము బుడిపెలు కుచించుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాదు, రొమ్ము పక్కన ఉండే చర్మంలో మార్పులు, నొప్పి



వంటి అదనపు లక్షణాలు పురుషుల్లో రొమ్ము క్యాన్సర్ కు సంకేతాలు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సాయం తీసుకోవాలి. పురుషుల్లో రొమ్ము క్యాన్సర్ ను గుర్తించేందుకు పూర్తిస్థాయి శారీరక పరీక్షలు, ఎక్స్ రే, బయాప్సీ, హిస్టోపాథాలనీ, హార్మోన్ రిసెప్టర్ పరీక్షలు నిర్వహిస్తారు.

# ఈ జీవనశైలితో మరణ ముప్పు తక్కువ

**మొక్కల ఆధారిత ఆహారానికి ప్రాధాన్యం**

**కూరగాయలు, పండ్లు తీసుకోవాలి**

**ఉప్పు, చక్కెర తగ్గించేయాలి**

**తగినంత నిద్ర, స్నేహితులతో గడపడం ముఖ్యం**



ఉన్నంత కాలం ఆరోగ్యంగా జీవించాలి. ఆరోగ్యమే ఉంటే దీర్ఘకాలం పాటు నిశ్చింతగా జీవించొచ్చు. ఆరోగ్యానికి, ఆయుర్దాయానికి మధ్య అనుబంధం ఉంది. అందుకే ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యం ఇవ్వాలి. హార్వర్డ్ టీహెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నిర్వహించిన తాజా అధ్యయనం ప్రకారం.. మెడిటేరియన్ జీవన విధానాన్ని ఆచరించే వారికి ముందస్తు మరణం ముప్పు తగ్గుతున్నట్టు ప్రకటించారు.

మెడిటేరియన్ లైఫ్ స్టయిల్ అంటే.. మొక్కల ఆధారిత ఆహారానికే పరిమితం కావడం. సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం, ఇతరులతో మంచి స్నేహ సంబంధాలు కొనసాగించడం. శారీరక చర్యలు ఉండేలా చూసుకోవడం. పండ్లు, కూరగాయలు, ముడి ధాన్యాలతోకూడిన ఆహారం తీసుకోవడం. ఈ విధానంలో ఉప్పు, చక్కెరలు గణనీయంగా తగ్గించేయాలి. తగినంత నిద్ర ఉండేలా చూసుకోవడం తప్పనిసరి.

1,10,799 మంది జీవన అలవాట్లను పరిశోధకులు అధ్యయనం చేశారు. ఇంగ్లండ్, వేల్స్, స్కాట్లాండ్ లో ఈ అధ్యయనం జరిగింది. తీసుకుంటున్న ఆహారం ఎలా ఉంటుంది? జీవనశైలిపై ప్రశ్నలు వేసి సమాధానాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా మూడు విభాగాలుగా వర్గీకరించి, వాటిపై ప్రశ్నలు సంధించారు. పండ్లు, కూరగాయలు, ముడి ధాన్యాలతో కూడిన ఆహారం. శారీరకరంగా శ్రమిస్తూ, తగినంత నిద్ర పోవడం, స్నేహితులతో గడపడం, ఉప్పు, చక్కెరలు తగ్గించడం గురించి తెలుసుకున్నారు.

తొమ్మిదేళ్ల తర్వాత గమనిస్తే, 4,247 మంది మరణించారు. ఒక్క కేన్సర్ వల్లే 2,401 మంది ముందస్తుగా ప్రాణాలు కోల్పోతే, 731 మందిని గుండె జబ్బులు బలి తీసుకున్నాయి. మెడిటేరియన్ లైఫ్ స్టయిల్ అనుసరించే విషయంలో మంచి స్కోరు ఉన్న వారికి మరణ ముప్పు 29 శాతం తక్కువగా ఉంటోందని పరిశోధకులు గుర్తించారు. ఇదేదో బావుందని చెప్పి వెంటనే మెడిటేరియన్ డైట్ ప్రారంభించకండి. పోషకాహార నిపుణులను సంప్రదించిన తర్వాతే, తమకు అనుకూలమైన విధంగా మెనూను అనుసరించడం మంచిది.

# నిద్రకు ముందు పసుపు కలిపిన పాలు సేవిస్తే ఎన్నో లాభాలు

**పసుపులో ఎన్నో ఆరోగ్య సుగుణాలు**

**ఇన్ ఫ్లమ్మేషన్ నుంచి ఉపశమనం**

**రక్తాన్ని శుద్ధి చేసే సామర్థ్యం**

పసుపు కలిపిన పాలను తాగడం అన్నది ఎన్నో తరాల నుంచి ఉంది. దీన్ని గోల్డెన్ మిల్క్ అని కూడా పిలుస్తారు. దీన్ని తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. తమ ఆరోగ్యాన్ని సహజసిద్ధంగా పెంచుకోవాలని చూసే వారికి ఇదొక మంచి ఔషధం అవుతుంది. పసుపులో యాంటీ మైక్రోబయల్, రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు ఉన్నాయి. కనుక నిద్రించడానికి ముందు ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో పసుపు కలుపుకుని తాగాలి. దీనివల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళతాయి. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీనివల్ల మొత్తం మీద ఆరోగ్యం పటిష్ఠమవుతుంది.

పసుపులో యాంటీ బ్యాక్టీరియా, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ ప్రాపర్టీలు ఉంటాయి. కనుక వ్యాధి నిరోధక శక్తి బలంగా మారడానికి ఇవి తోడ్పడతాయి. పసుపుకు రక్తాన్ని శుద్ధి చేసే సామర్థ్యం కూడా ఉంది. పసుపులోని ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ బరువు తగ్గేందుకు అనుకూలిస్తాయి. చర్మం ఆరోగ్యానికి పసుపు మంచిది. వయసు పెరుగుతున్న దశలో చర్మం ముడతలు పడకుండా కాపాడుతుంది. ముఖ్యంగా పుసుపులోని యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యంలోని వారికి ఎంతో అవసరం. పసుపులో కర్కుమిన్ ఉంటుంది. ఇది జీర్ణశక్తిని పెంచుతుంది. కడుపుబ్బరాన్ని తగ్గిస్తుంది. గాల్ బ్లాడర్ లో బైల్ తయారికి సాయపడుతుంది. పసుపులో యాంటీ ఇన్ ఫ్లమ్మేషన్ ప్రాపర్టీలు కూడా ఉన్నాయి. దీంతో రోజు రాత్రి పసుపు పాలను తాగడం వల్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

# టైటాన్స్ తడాఖా

## బెంగళూరుపై విజయం

## రాణించిన అర్షద్, గిల్



అహ్మదాబాద్: గుజరాత్ టైటాన్స్ సత్తా చాటింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో బెంగళూరుపై విజయం సాధించింది. గుజరాత్ బౌలర్లు సూపర్‌గా బౌలింగ్ చేయడంతో మొదట బెంగళూరు 19.2 ఓవర్లలో 155 పరుగులకే ఆలౌటైంది. దేవ్‌దత్ పడిక్కల్ (40; 24 బంతుల్లో 5ఐ4, 2ఐ6) టాప్ స్కోరర్. అర్షద్ ఖాన్ (3/22), రషీద్ ఖాన్ (2/19), జేసన్ హోల్డర్ (2/29) ఆర్సీబీని దెబ్బతీశారు. శుభ్‌మన్ గిల్ (43; 18 బంతుల్లో 4ఐ4, 3ఐ6), బట్లర్ (39; 19 బంతుల్లో 2ఐ4, 4ఐ6), తెవాతియా (27 నాటౌట్; 17 బంతుల్లో 4ఐ4) మెరవడంతో లక్ష్యాన్ని గుజరాత్ 15.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. భువనేశ్వర్ (3/28) అద్భుతంగా బౌలింగ్ చేశాడు. హేజిల్‌వుడ్ (0/56) తేలిపోయాడు.

**గిల్ ధనాధన్:** స్వల్ప ఛేదనలో గుజరాత్‌కు అదిరే ఆరంభం లభించింది. 2.5 ఓవర్లకే స్కోరు 42. సాయి సుదర్శన్ (6)తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన గిల్.. రెచ్చిపోయి ఆడాడు. మొదటి ఓవర్లో భువనేశ్వర్ బౌలింగ్‌లో వరుసగా 4, 6 బాదిన అతడు.. ఆ తర్వాత హేజిల్‌వుడ్ ఓవర్లో మూడు ఫోర్లు, రెండు సిక్స్‌లతో ఏకంగా 24 పరుగులు రాబట్టాడు. కానీ భువి వరుస ఓవర్లలో సుదర్శన్, గిల్‌ను ఔట్ చేసి ఆర్సీబీని పోటీలోకి తెచ్చాడు. అయితే బట్లర్ ధాటైన బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును నడిపించాడు. సుందర్ (12) ధాటిగా ఆడకపోయినా.. అతడికి అండగా నిలవడంతో జీటీ 92/2తో లక్ష్యం దిశగా సాగింది. కానీ అంతా సాఫీగా సాగుతున్న దశలో ఇన్నింగ్స్ కుదుపునకు గురైంది. 19 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు పడగొట్టిన ఆర్సీబీ.. మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చింది. జోరుమీదున్న బట్లర్‌ను భువి బౌల్డ్ చేయగా.. షెపర్డ్ ఒకే ఓవర్లో షారుఖ్ (8), సుందర్‌ను పెవిలియన్ చేర్చాడు. 11వ ఓవర్లో సుందర్ నిష్క్రమించేటప్పటికి గుజరాత్ స్కోరు 111. సాధించాల్సిన రన్‌రేట్ చాలా తక్కువే ఉన్నా, చకచకా వికెట్లు పడటిడంతో ఆ జట్టు కాస్త ఒత్తిడికి గురైంది. కానీ రాహుల్ తెవాతియా, హోల్డర్ (12) ఆ ఒత్తిడిని పెరగనివ్వలేదు. టైటాన్స్‌ను విజయం దిశగా నడిపించారు. ఆరో వికెట్‌కు 36 పరుగులు జోడించిన హోల్డర్.. 14వ ఓవర్లో, జట్టు స్కోరు 141 వద్ద ఔటైనా.. రషీద్ ఖాన్ (7 నాటౌట్)తో కలిసి తెవాతియా పని పూర్తి చేశాడు.

ఆర్సీబీకి కళ్లెం: ఈ సీజన్‌లో మంచి ఫామ్‌లో ఉన్న ఆర్సీబీ మొదట బ్యాటుతో తడబడింది. గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆ జట్టుకు కళ్లెం వేశారు. పడిక్కల్ కాస్త పోరాడడంతో బెంగళూరు గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ.. ఇన్నింగ్స్‌ను బాగానే ఆరంభించింది. కోహ్లి (28; 13 బంతుల్లో 5ఐ4, 1ఐ6) బ్యాట్ ఝుళిపించడంతో 2.3 ఓవర్లలోనే 34 పరుగులు చేసింది. రబాడ ఓవర్లో కోహ్లి వరుసగా అయిదు ఫోర్లు కొట్టడం విశేషం. కానీ వరుస ఓవర్లలో బెతెల్ (5), కోహ్లిని ఔట్ చేయడం ద్వారా సిరాజ్, రబాడ ఆ జట్టును దెబ్బతీశారు. అయినా కెప్టెన్ పాటీదార్ తోడుగా నిలవగా.. పడిక్కల్ బ్యాట్ ఝుళిపించడంతో ఇన్నింగ్స్ సాఫీగానే సాగింది. సిరాజ్ ఓవర్లో పడిక్కల్ సిక్స్, రెండు ఫోర్లు బాదేశాడు. పాటీదార్ ధాటిగా ఆడకపోయినా 8వ ఓవర్లో 79/2తో బెంగళూరు మెరుగ్గానే కనిపించింది. కానీ అనూహ్యంగా తడబడింది. 17 పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు చేజార్చుకుని చిక్కుల్లో పడింది. వరుస ఓవర్లలో పాటీదార్ (19), జితేశ్ శర్మ (1), టిమ్ డేవిడ్ (9), కృనాల్ పాండ్య (4) పెవిలియన్ బాట పట్టారు. పాటీదార్, కృనాల్‌ను ఎడమచేతి వాటం పేసర్ అర్షద్ ఔట్ చేయగా.. జితేశ్‌ను హోల్డర్, డేవిడ్‌ను రషీద్ ఖాన్ పెవిలియన్ చేర్చారు. 96కే ఆరు వికెట్లు కోల్పోయిన జట్టును పడిక్కల్ ఆదుకునే ప్రయత్నం చేశాడు. షెపర్డ్ (17)తో ఏడో వికెట్‌కు 30 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు.

# ఈ బాదుడు ఇలాగే కొనసాగితే..



18 ఏళ్ల కిందట ఐపీఎల్ మొదలైనపుడు ఆ సీజన్లో నమోదైన 200 పైచిలుకు స్కోర్లు 11 మాత్రమే. కానీ ఈ ఐపీఎల్‌లో ఇప్పటిదాకా 42 మ్యాచ్‌లు జరిగితే.. అందులో 35 సార్లు 200ం స్కోర్లు ఉండడం గమనార్హం. దీన్ని బట్టే బ్యాటర్ల ఆధిపత్యం ఏ స్థాయిలో సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. గత వారం పంజాబ్‌తో మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్ ఏకంగా 264 పరుగులు చేసింది. టీ20ల్లో ఇంత పెద్ద స్కోరు చేస్తే మ్యాచ్ ఫలితం ముందే తేలిపోవాలి! అవతలి జట్టు బ్యాటింగ్‌కు దిగకముందే ఓటమికి సిద్ధం అయిపోవాలి! కానీ పంజాబ్ ఆశలు కోల్పోలేదు. బ్యాటర్లు ఒకరితో పోటీ పడి షాట్లు ఆడడంతో అంత పెద్ద లక్ష్యాన్ని 7 బంతులు మిగిలుండగానే ఛేదించి పడేసింది. తాజాగా ముంబయి జట్టు 244 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశిస్తే.. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏమాత్రం తడబడకుండా ఛేదనను పూర్తి చేసింది. అటు పంజాబ్, ఇటు హైదరాబాద్ ఇన్నింగ్స్‌లను గమనిస్తే.. ఆ జట్లు అనూహ్యంగా గెలిచేసినట్లు అనిపించదు. ప్రణాళిక ప్రకారం ఆడి గెలిచినట్లు అర్థమవుతుంది. ఇలాంటి మ్యాచ్‌ల అనుభవం తర్వాత ఐపీఎల్‌లో ఎంత స్కోరు చేసినా గ్యారెంటీ లేని పరిస్థితి. ముఖ్యంగా విధ్వంసక బ్యాటింగ్ లైనప్‌లతో కూడిన సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ లాంటి జట్లు బౌలర్లకు మరణ శాసనం రాస్తున్నాయి. పంజాబ్ ఐపీఎల్‌లో రికార్డు స్థాయిలో పదిసార్లకు పైనే 200ం లక్ష్యాలను ఛేదించగా.. ఈ సీజన్లో ఆడిన 9 మ్యాచ్‌ల్లో ఏడుసార్లు హైదరాబాద్ 200 పైచిలుకు స్కోర్లు సాధించడం గమనార్హం. ఐపీఎల్ అత్యధిక ఛేదన రికార్డు పంజాబ్ (265)ది కాగా.. అత్యధిక స్కోరు (287) ఘనత సన్‌రైజర్స్ సొంతం.

టీ20 క్రికెట్‌లో మొదటి నుంచి బంతిపై బ్యాటుదే పైచేయి కానీ.. ఈ మధ్య బ్యాటర్ల ఆధిపత్యం మరీ పెరిగిపోతోంది. ఒక బ్యాటర్ ఎంత బలంగా బాదితే అంత డిమాండ్ అన్నట్లుగా పరిస్థితి తయారవడంతో యువ ఆటగాళ్లందరూ ఆ రకమైన ఆటకే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో బ్యాటింగ్ శైలిలో, షాట్లలో కళాత్మకత కనుమరుగవుతోంది. టెక్నిక్ ఎంత బాగున్నా అదిప్పుడు పెద్ద విషయమే కాదు. యువ ఆటగాళ్లందరూ టీ20 అవసరాలకు తగ్గట్లు భారీ షాట్లు సాధన చేస్తున్నారు. కొంచెం ఆచితూచి ఆడే బ్యాటర్లు కూడా.. మారిన పరిస్థితుల్లో తమ ఆటతీరును మార్చుకోక తప్పట్లేదు. విధ్వంసకరంగా ఆడితే తప్ప మనుగడ కష్టమవుతోంది. ఐపీఎల్ కెరీర్ ఆరంభంలో అభిషేక్ శర్మ కొంచెం నెమ్మదిగానే ఆడేవాడు. తన బ్యాటింగ్‌లో టెక్నిక్ కనిపించేది. కానీ కొన్ని సీజన్ల ముందు అతడి ఆటతీరు మారిపోయింది. ఇప్పుడు ఐపీఎల్‌లోనే కాదు, ప్రపంచ క్రికెట్లోనే అత్యంత విధ్వంసకరంగా ఆడే బ్యాటర్లలో అతనొకడిగా మారాడు. ఇక 15 ఏళ్లకే ప్రకంపనలు రేపుతున్న వైభవ్ సూర్యవంశీ.. బంతిని ఎలా బాదేస్తున్నాడో చూస్తున్నాం. కొత్త తరానికి ఇలాంటి బ్యాటర్లే స్ఫూర్తిగా మారుతున్నారు. బాదడమే పనిగా పెట్టుకుంటున్న బ్యాటర్లకు ఏదీ అసాధ్యంగా అనిపించడం లేదు. భారీ షాట్లను బాగా ప్రాక్టీస్ చేసి బరిలోకి దిగుతున్న బ్యాటర్లకు.. పిచ్‌లు, పరిస్థితులు, పవర్ ప్లే నిబంధనలు బాగా కలిసి వస్తున్నాయి. ఇంతకుముందులా క్రీజులో కుదురుకునే వరకు ఆచితూచి ఆడడం.. మంచి బంతుల్ని గౌరవించడం, చెత్త బంతుల్నే శిక్షించడం.. ఇలాంటి లెక్కలేవీ ఇప్పుడు లేవు. తొలి బంతి నుంచి బాదడమే పనిగా పెట్టుకుంటున్నారు. ఒక మేటి బౌలర్ వచ్చాడని జాగ్రత్త పడడం లాంటిదేమీ ఉండట్లేదు. అందుకే బుమ్రా సైతం ధారాళంగా పరుగులు సమర్పించుకుంటున్నాడు. వైభవ్ సూర్యవంశీ, సలీల్ అరోరా లాంటి కుర్రాళ్లు బుమ్రా బౌలింగ్‌లో ఎలా బాదేశారో చూశాం.

ఐపీఎల్‌లో బ్యాటర్ల దూకుడు మాటేమో కానీ.. బౌలర్ల పరిస్థితే దయనీయంగా మారుతోంది. బుమ్రా లాంటి బౌలర్‌నే లెక్క చేయడం లేదంటే.. మిగతా బౌలర్ల సంగతి అర్థం చేసుకోవచ్చు. ఒక మ్యాచ్‌లో ఏ బౌలరైనా 10 లోపు ఎకానమీ నమోదు చేస్తే గొప్పే. బ్యాటుకు, బంతికి మధ్య పోటీ లేకపోవడం.. ఐపీఎల్ బ్యాటర్ల టోర్నీగా మారిపోతుండడం ప్రేక్షకుల్లో అనాసక్తికి కారణమవుతోంది. అతి సర్వత్ర వర్జయేత్ అనే నానుడికి తగ్గట్లే ఉంది పరిస్థితి. బ్యాటర్లు ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లు బాదేస్తుండడంతో.. ఈ విధ్వంసాలు అభిమానులకు అంతగా కిక్కివ్వడం లేదు. ఎప్పుడో ఒక మ్యాచ్‌లో మినహాయిస్తే బౌలర్లకు అవకాశమే ఉండట్లేదు. గత వారం లఖ్‌నవూ, కోల్‌కతా మ్యాచ్‌లో తక్కువ స్కోర్లు నమోదవడం, ఆ పోరు టై అయి సూపర్‌ఓవర్‌కు దారి తీయడంతో అభిమానుల దృష్టి దాని వైపు మళ్లింది. 529 పరుగులు నమోదైన దిల్లీ-పంజాబ్ మ్యాచ్ కంటే తక్కువ స్కోర్లు నమోదైన ఈ పోరే ఆసక్తి రేకెత్తించిందంటే అతిశయోక్తి కాదు. చివరి ఓవర్లో 20 పైగా పరుగులు బాదేసి ఓ జట్టు గెలిచిన మ్యాచ్ కంటే 10 లోపు పరుగులను బౌలింగ్ జట్టు కాపాడుకునే పోరే ఇప్పుడు ఎక్కువ కిక్కిస్తోందంటే.. బ్యాటర్ల వీరబాదుడు మొహం మొత్తేలా చేస్తోందనడానికి సంకేతమే!

## సియా గౌతమ్ చీర స్టైల్ ప్యూర్ గ్రేస్



# సిద్ధు, మీను ఆదర్శం కాబోతున్నారా..?





ఒకప్పుడు సినిమాలతో పోల్చితే టీవీ షోలు, సీరియల్స్‌ను చాలా చిన్న చూపు చూసే వారు. కాలక్రమేనా సినిమాలకు ఏమాత్రం తక్కువ కాకుండా టీవీ షోలు, సీరియల్స్ నడిచాయి. సినిమాలతో ఏ స్థాయిలో నటీనటులకు గుర్తింపు దక్కిందో, దాదాపు అదే స్థాయిలో టీవీ షోలతో, సీరియల్స్ తో నటీనటులకు గుర్తింపు దక్కిన విషయం తెల్సిందే. ఇప్పుడు మళ్లీ టీవీల ప్రాభవం తగ్గినట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు సినిమాలతో ఓటీటీ కంటెంట్ పోటీ పడుతోంది. థియేట్రికల్ రిలీజ్ అవుతున్న సినిమాలకు ఏమాత్రం తగ్గకుండా ఓటీటీ వెబ్ సిరీస్‌లు మంచి సక్సెస్‌ను దక్కించుకుని, అత్యధిక ప్రేక్షాభిమానంను సొంతం చేసుకుంటున్న విషయం మనం చూస్తూనే ఉన్నాం. అందుకే మెల్ల మెల్లగా సినిమా స్టార్స్ ఓటీటీ కంటెంట్ లో నటించడం, వెబ్ సిరీస్‌ల్లో నటించడం వంటివి చేస్తున్నారు.

**హాలీవుడ్‌లో వెబ్ సిరీస్‌ల జోరు....**

ఇప్పటికే హాలీవుడ్ స్టార్స్ సినిమాలు, వెబ్ సిరీస్‌లను సమానంగా చూస్తున్నారు. కానీ ఇండియాలో మాత్రం ఆ వ్యత్యాసం క్లీయర్‌గా కనిపిస్తోంది. ఆ వ్యత్యాసం మెల్ల మెల్లగా తగ్గుతూ వస్తోంది. బాలీవుడ్‌కి చెందిన పలువురు స్టార్స్ ఇప్పటికే ఓటీటీ కంటెంట్‌లో నటించేందుకు రెడీ అయ్యారు. కొందరు ఇప్పటికే వెబ్ సిరీస్‌ల్లో నటించి మెప్పించిన విషయం తెల్సిందే. తెలుగు స్టార్ హీరో వెంకటేష్ సైతం వెబ్ సిరీస్‌లో కనిపించాడు. రానాతో కలిసి వెంకటేష్ రానా నాయుడు వెబ్ సిరీస్ లో నటించాడు. అయితే ఆ వెబ్ సిరీస్ పూర్తి స్థాయి తెలుగు సిరీస్ కాకపోవడంతో ప్రేక్షకులు పెద్దగా ఆధరించలేదు. అయితే ఇతర భాషల్లో రానా నాయుడు సిరీస్‌కి మంచి స్పందన దక్కింది. ఇప్పుడు ప్యూర్ తెలుగు వెబ్ సిరీస్ ఒకటి రాబోతుంది. తెలుగులో చాలా వెబ్ సిరీస్‌లు వచ్చాయి. కానీ నోటెడ్ హీరో నటించబోతున్న వెబ్ సిరీస్ ఇదే కావడం విశేషం.

**సిద్దు జొన్నలగడ్డ హీరోగా వెబ్ సిరీస్...**

యంగ్ హీరో సిద్దు జొన్నలగడ్డ ప్రధాన పాత్రలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో ఒక వెబ్ సిరీస్ రూపొందబోతుంది. ఇప్పటికే స్టోరీ లైన్ రెడీ అయ్యింది. స్క్రిప్ట్ వర్క్ మొదలైంది. మరో వైపు ప్రీ ప్రొడక్షన్ వర్క్ సైతం జరుగుతోంది. ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరి ఈ వెబ్ సిరీస్‌కి దర్శకత్వం వహించబోతున్నాడు. ఇప్పటి వరకు స్టార్ హీరోలతో సినిమాలను నిర్మించి పాపులర్ అయిన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ ఇప్పుడు వెబ్ సిరీస్ నిర్మాణంలో అడుగు పెట్టడంతో చాలా మంది ఇతర పెద్ద నిర్మాతలకు నాగవంశీ ఆదర్శం కాబోతున్నాడనే టాక్ వినిపిస్తోంది. వెబ్ సిరీస్ అనగానే చిన్న చూపు ఉన్న వారు ఈ వెబ్ సిరీస్ వచ్చిన తర్వాత కచ్చితంగా తమ అభిప్రాయంను మార్చుకుంటారని, హిందీలో మాదిరిగా వెబ్ సిరీస్‌లకు ముందు ముందు టైం రాబోతుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

**వెబ్ సిరీస్‌లో మీనాక్షి చౌదరి...**

ఈ భారీ వెబ్ సిరీస్‌లో సిద్దుకు జోడీగా హీరోయిన్ మీనాక్షి చౌదరి నటించబోతుంది. హీరోయిన్‌గా ఫుల్ బిజీగా ఉన్న మీనాక్షి చౌదరి ఇలా వెబ్ సిరీస్‌కు ఓకే చెప్పడం వల్ల చాలా పెద్ద సాహసం చేస్తుందని చెప్పాలి. ఎందుకంటే ఆఫర్లు తక్కువ ఉన్న వారు, పెద్దగా క్రేజ్ లేని వారు, కెరీర్ చివర్లో ఉన్న వారు మాత్రమే వెబ్ కంటెంట్ లో కనిపించేందుకు ఆసక్తి చూపిస్తూ ఉంటారు. ఇప్పుడు సిద్దు జొన్నలగడ్డ, మీనాక్షి చౌదరిలు వెబ్ సిరీస్‌లు నటిస్తున్న కారణంగా ఇండస్ట్రీలో ఇతర యంగ్ స్టార్స్‌కి వీళ్లు ఆదర్శం కాబోతున్నారు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ వెబ్ సిరీస్ హిట్ అయితే కచ్చితంగా ముందు ముందు యంగ్ హీరోలు వెబ్ సిరీస్‌ల వైపు చూసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. హీరోయిన్స్ సైతం పారితోషికం, ఇతర విషయాలు పక్కన పెట్టి నటిగా నిరూపించుకునేందుకు వెబ్ సిరీస్‌లకు కమిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com